# నినాదం

నిఖార్సైన జర్నలిజం

శనివారం 22 ఫిబ్రవరి 2025 | తెలంగాణ ప్రాంతీయం | పేజీలు 8




## పోలేపల్లికి పోటెత్తిన

# భక్తజనం

2లో..

- బోనాలు, కోడిపుంజులు, యాటలు సమర్పించుకున్న భక్తులు
- దర్శించుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, మాజీఎమ్మెల్యే పట్నంనరేందర్ రెడ్డి

కొడంగల్ ప్రజల ఇలవేల్పు పోలేపల్లి రేణుక ఎల్లమ్మ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కోరికలు నెరవేర్చే కొంగుబంగారం గా రేణుక మాతను కొలవడం ఆనవాయితీ.ఉమ్మడి మహబూబ్ నగర్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల ప్రజలతోపాటు సరిహద్దు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు ప్రతియేటా వేలాదిమంది భక్తజనం పాల్గొంటారు.అమ్మవారిని దర్శించుకోడానికి వచ్చిన భక్తులు భోనం కుండలతో అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేసి, కాయచక్కెరలు, కల్లుసాకతో మొక్కులు చెల్లించుకున్నారు. మరికొందరు కోడిపుంజులు, మేకపోతులు కోసి అమ్మ వారికి తీర్థ ప్రసాదాలు సమర్పించుకున్నారు.

కొడంగల్, ఫిబ్రవరి21( నినాదం న్యూస్) :




## సైలెంట్ అయినా

# కాంగ్రెస్ వారియర్స్

- నియోజకవర్గాలోనూ డీలాపడ్డ కాంగ్రెస్ సోషల్ మీడియా
- బీఆర్ఎస్‌కు స్ట్రాంగ్ కౌంటర్లు ఇవ్వడంలో విఫలం
- సొంత పార్టీ పోల్సే కాదు
- ఇతర పార్టీ ఫోల్సులను ఫెయిల్యూర్
- డిఫెన్స్‌లో పడిపోతున్న సోషల్ మీడియా టీమ్

వివరాలు 2లో

సుదీర్ఘకాలం తర్వాత తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చింది. అదే ఊపుతో ప్రజలకు మంచి చేయాలనే తలంపుతో సర్కారు ఆ దిశగా ముందుకు వెళుతున్నది. ఎక్కడాలేనివిధంగా సంక్షేమ స్కీములను అమలు చేసేందుకు అన్నివిధాలా ప్రయత్నిస్తున్నది. కానీ ఆ స్కీములు, కాంగ్రెస్ సర్కారు చేస్తోన్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మాత్రం కాంగ్రెస్ పార్టీ విఫలమవుతున్నదనే చర్చ జరుగుతున్నది. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వింగ్ ఇటీవల కాలంలో దారుణంగా ఫెయిల్ అవుతూ వస్తున్నది. దీనికితోడు తాజాగా యాదాద్రిభువనగిరి జిల్లాలో భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ సర్కారు పాలనపై నిర్వహించిన పోల్ ను తిప్పికొట్టడంలోనూ ఆ పార్టీ సోషల్ మీడియా విఫలమయ్యింది. ఫలితంగా ఆ పోల్స్ కాస్త సోషల్ మీడియాలో బీఆర్ఎస్ కు అనుకూలంగా మారిపోవడం చర్చనీయాంశమయ్యింది.




కోదాడ, నినాదం :

## కన్నుల పండుగల శివ స్వాముల

# పడిపూజ మహోత్సవం

- వ్యవసాయ కమిటీ చైర్మన్ గడమీద పెంటయ్య గౌడ్ ఆధ్వర్యంలో పడిపూజ

**చేవెళ్ల ఫిబ్రవరి 21(నినాదం న్యూస్):** చేవెళ్ల మండల పరిధిలోని నాంచేరి గ్రామంలో శుక్రవారం ముడిమ్యాల సహకార సంఘం చైర్మన్ గోనె ప్రతాప్రెడ్డి, చేవెళ్ల మార్కెట్కమిటి చైర్మన్ గడ్డమీది పెంటయ్యగౌడ్ ఆధ్వర్యంలో సురేష్ పంతులు కరకములచే శివస్వాముల మహాపడి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ, శివలింగానికి రుద్రాభిషేకం, సహస్రనామావాళి, శివస్తోత్రం, శివర్చాన, పుష్పాభిషేకం, హారతి, భజన కార్యక్రమాలు నిర్వహించారు. 12మెట్లపై పూలు, పండ్లు కర్పురంతో అలంకరించి పడిని కాల్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శివ నామస్మరణం చేస్తే సకల పాపాలు తొలగిపోతాయని, మానవాళికి శివుని ఆజ్ఞా తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రతిరోజు శివుని స్మరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామమంతా శివనామస్మరణతో మర్మోగింది. ఈ కార్యక్రమంల ముడిమ్యాల సొసైటీ వైస్ చైర్మన్ ఎర్ర మల్లేష్, బిజెపి మండల అధ్యక్షుడు అతేల్లి అనంతరెడ్డి మాజీ సర్పంచులు రవీందర్రెడ్డి, పడాల ప్రభాకర్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు, సర్వేయర్ శంకర్, ఆయా గ్రామాల నాయకులు, శివ భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పోలేపల్లికి పోటెత్తిన భక్తజనం

పొద్దంతా బోనాలు, కోడిపుంజులు, మేకపోతులు సమర్పించుకొని అక్కడే వంటావార్పు చేసుకుని పిల్లాపాపలతో గడిపిన అనంతరం సాయంత్రం సూర్యుడు అస్తమించే సమయంలో శిడెతిరగడం ఇక్కడి ప్రధాన ప్రత్యేకత. అమ్మవారి ప్రతిమను శిడి లో పెట్టి పొడవాటి చెక్క మొద్దు చివర భాగాన శిడె కట్టి అమ్మవారి ఆలయం ముందర శిడెతిరుగుతుండగా భక్తులందరూ పసుపు బండారు చల్లి అమ్మవారిని స్మరించుకుంటారు. శుక్రవారం రోజు భక్తులు తండోపతండాలుగా వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు, ప్రభుత్వ అధికారులు అంటున్నారు.

### ఎస్ఐసీ కొత్త ప్లాన్ : సింగిల్ పేమెంట్..

## జీవితాంతం ఆదాయం!

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ( ఎల్ఐసి ) ఆఫ్ ఇండియా 'స్మార్ట్ పెన్షన్' ప్లాన్ను ప్రారంభించింది. పదవీ విరమణ సమయంలో ఆర్థిక భద్రతను అందించే లక్ష్యంతో సంస్థ ఈ ప్లాన్ స్టార్ట్ చేసింది. దీని గురించి మరిన్ని వివరాలు వివరంగా.. ఈ కథనంలో చూసేద్దాం. ఒక ఉద్యోగి తన పదవీ విరమణ తరువాత కూడా.. క్రమం తప్పకుండా ఆదాయం వస్తే బాగుంటుందని, ఇలాంటి ప్లాన్స్ కోసం వెతుకుతుంటారు. అలాంటి వారికి ఎస్ఐసీ ప్రారంభించిన ఈ స్మార్ట్ పెన్షన్ ప్లాన్ చాలా అద్భుతంగా ఉంటుంది. ఇది సింగిల్-ప్రీమియం, నాన్-పార్, నాన్-లింక్డ్ ప్లాన్ సింగిల్ లైఫ్, జాయింట్ లైఫ్ యాన్యుటీ వంటి ఆప్షన్లలో అందుబాటులో ఉంటుంది. సింగిల్ లైఫ్, జాయింట్ లైఫ్ అవసరాలకు అనుగుణంగా స్మార్ట్ పెన్షన్ ప్లాన్ ఎంచుకోవచ్చు. జీవిత భాగస్వాములు, తల్లిదండ్రులు, పిల్లలు, మనవరాళ్ళు, తోబుట్టువులు, అత్తమామలు వంటి కుటుంబ సభ్యుల కోసం జాయింట్ లైఫ్ యాన్యుటీని ఎంచుకోవచ్చు. ఈ ప్లాన్ ఎంచుకుంటే.. ప్రియమైనవారికి ఆర్థిక స్థిరత్వాన్నిఅందించవచ్చు. నెల, మూడు నెలలు, ఆరు నెలలు, సంవత్సరం ఇలా మీకు తగిన విధంగా యాన్యుటీ చెల్లింపులు ఎంచుకోవచ్చు. కొన్ని షరతులకు లోబడి.. కొంత మొత్తం లేదా పూర్తిగా కూడా విత్‌అ చేసుకోవచ్చు. ఈ ప్లాన్ను.. పాయింట్ ఆఫ్ సేల్స్ పర్సన్స్-లైఫ్ ఇన్సూరెన్స్ (పిఓఎస్‌పి-ఎల్ఐ) కామన్ పబ్లిక్ సర్వీస్ సెంటర్స్ ( సిపిఎస్‌సి - ఎస్‌పివి) వంటి ఏజెంట్ల ద్వారా ఆఫ్లైన్లో కొనుగోలు చేయవచ్చు. లేదా ఎస్ఐసీ అధికారిక వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో కొనుగోలు చేయవచ్చు.

**అర్హత ప్లాన్ వివరాలు..**

18 సంవత్సరాల నుంచి 100 సంవత్సరాల మధ్య వయస్సు గల వ్యక్తులు ఎవరైనా ఈ ప్లాన్ ఎంచుకోవచ్చు. అయితే మీరు ఎంచుకునే యాన్యుటీ ఆప్షన్లను బట్టి.. అర్హత మారుతుంది. ఇక్కడ గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే.. ఒకసారి యాన్యుటీ ఆప్షన్ ఎంచుకున్న తరువాత, దానిని మళ్ళీ మార్చలేము. ఎంచుకునే సమయంలోనే జాగ్రత్తగా సెలక్ట్ చేసుకోవాలి. స్మార్ట్ పెన్షన్ ప్లాన్కు.. మార్కెట్తో సంబంధం లేదు. మార్కెట్లు లాభాల్లో ఉన్నా.. నష్టాల్లో ఉన్న మీ డబ్బుకు గ్యారెంటీ లభిస్తుంది. నెలకు రూ. 1,000, మూడు నెలలకు రూ. 3,000, ఏడాది రూ. 12,000 చొప్పున పాలసీదారు యాన్యుటీని ఎంచుకోవచ్చు. ఈ ప్లాన్ కోసం కనీస కొనుగోలు మొత్తం రూ. 1 లక్ష. గరిష్ట కొనుగోలుకు ఎలాంటి పరిమితి ఉండదు.




# సైలెంట్ అయినా కాంగ్రెస్ వారియర్స్

**కోదాడ,నినాదం :** ప్రస్తుత ఎమ్మెల్యేల కంటే.. మాజీ ఎమ్మెల్యే లే బెటర్ అనే వాయిస్ ను చర్చ పెట్టగలిగేలా బీఆర్ఎస్ సోషల్ మీడియా సక్సెస్అయ్యిందని చెప్పాలి.

**అసలేం జరుగుతోంది..?**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం సోషల్ మీడి యానేనని చెప్పాలి. సరిగ్గా అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఫుల్ యాక్టివ్గా పని చేసిన సోషల్ మీడియా టీమ్స్ ప్రస్తుతం చాలా నియోజకవర్గాల్లో సైలెంట్ మోడ్ లోకి వెళ్లి పోయాయి. కనీసం గ్రామస్థాయి వాట్సప్ గ్రూపుల్లో కాంగ్రెస్ సోషల్ మీడియా వింగ్ ప్రతిసారి డిఫెన్స్ లోనే పడిపోతున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు అంతగా కష్టపడిన సోషల్ మీడియా వారియర్స్ ఎందుకు పత్తాలేకుండా పోయారు. అసలు పార్టీ సోషల్ మీడియా గ్రూపులను ఎందుకు మెయింటెన్ చేయలేకపోతున్నారనే చర్చ ప్రధానంగా వినిపిస్తున్నది.

**ఎమ్మెల్యేలు వారియర్ సన్ను పట్టించుకోవట్లే..**

చాలా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మరుగున పడిపోయింది. కనీసం ఆ నియోజకవర్గ ఎమ్మెల్యేలు చేసేప్రోగ్రాము సైతం పబ్లిసిటీ చేసుకునే పరిస్థితిలో కన్పించడం లేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 అసెంబ్లీ నియోజ కవర్గాల్లో 11 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీనే విజయం సాధించింది. అయితే ఇప్పటికే బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల ప్రోగ్రామ్స్, సోషల్ మీడియాలో పోస్టు చేసినంతగా కాంగ్రెస్ ఎమ్మెల్యేల కార్యక్రమాలు కన్పించడం లేదు. నిజానికి బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఎమ్మెల్యేలు, ఆఖరికి జడ్పీటీసీ లు సైతం పీఆర్ఓ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. కానీ నేడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆ దిశగా దృష్టి సారించడం లేదు. ఎంత సేపటికీ ప్రధాన మీడియాకు సమాచారం అందించామా...? చేతులు దులుపుకున్నామా..? అన్న పరిస్థితే కన్పిస్తున్నది. కానీ సర్కారు చేపట్టిన ప్రోగ్రామస్ను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లాలనే ఆలోచనేకరువయ్యింది.

**సోషల్ మీడియా ఖాతాలు పెద్దగా లేవ్..**

ప్రస్తుతం సోషల్ మీడియాలో వాట్సప్ గ్రూపులు. ఎక్స్(ట్విట్టర్) ఖాతా, ఇన్స్టా గ్రామ్, ఫేస్బుక్, యూట్యూబ్ తదితరాలు కీ రోల్ పోషిస్తున్నాయి. ఎప్పటికప్పుడు ఆ ఖాతాల్లో తమ యాక్టివిటీస్ను పోస్టు చేయడం వల్ల పబ్లిక్ లోకి వెళ్లే అవకాశం ఉంది. కానీ కాంగ్రెస్ నుంచి ఆ స్పందన కన్పించడం లేదు. నేటికి జిల్లా కాంగ్రెస్ పెద్దగా ఆఫీషియల్ సోషల్ మీడియా అకౌంట్లు లేకపోవడం కొసమెరుపు. నిజానికి ఇప్పుడు మారుమూల పల్లెల్లోని ప్రజలు సైతం స్మార్ట్ ఫోన్స్ విచ్చలవిడిగా ఉపయోగిస్తున్నారు. డైరెక్టా చెప్పడం కంటే సోషల్ మీడియాలో చెబితేనే త్వరగా వారికి రీచ్ అవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో కొంతమంది ఎమ్మెల్యేలు సోషల్ మీడియాలో యాక్టివ్గా లేకపోవడం గమనించదగ్గ విషయమే. అదే సమయంలో జిల్లా కలెక్టర్ మినహా మిగతా ఏ శాఖలు తమ సమాచారాన్ని ప్రజలకు చెరవేసే పరిస్థితి కన్పించడం లేదు. ఇదిలావుంటే.. గత ఎన్నికల్లో కాంగ్రెస్ కోసం కష్టపడిన సోషల్ మీడియా ఇన్చార్జులు. గ్రామాల కోఆర్డినే టర్లు పార్టీ గెలిచిన తర్వాత పెద్దగా పట్టించుకోవడం మానేశారు. కనీసం గ్రామానికి వెళ్లినప్పుడో.. ఏదైనా మీటింగ్లో కలిసినా పలకరించిన పాపాన పోవడం లేదు. దీనికి తోడు ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికో.. లేక అప్పటివరకు అంటిముట్టనట్టుగా తిరిగే వారికోఎమ్మెల్యేలు ప్రయారిటీ ఇస్తుండడంతో అప్పటి సోషల్ మీడియా ఇన్చార్జిల్ అంతా తమకెందుకు అన్నట్టుగా వదిలేస్తుండడం కొసమెరుపు. బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ కోసం సోషల్ మీడియాలో పోస్టట్లు పెట్టి అప్పటి అధికార పార్టీతో నానా ఇబ్బందులు పడ్డవారిని సైతం గుర్తించకపోవడం వల్ల కాంగ్రెస్ సోషల్ మీడియా వెనుకబడడానికి ఓ రకంగా కారణమని చెప్పాలి. ఇప్పటికైనా కాంగ్రెస్ అధిష్టానం ఈ వ్యవహారంపై దృష్టి సారించకపోతే... రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ మేరకు ఫలితం అనుభవించాల్సి వస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# బీఆర్ఎస్ పార్టీ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలి

**- గోవిందాయిపల్లి మాజీ సర్పంచ్ రాములు నాయక్**

**మహేశ్వరం, ఫిబ్రవరి21 (నినాదం న్యూస్)** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలంలోని గోవిందాయి పల్లి తండా గ్రామ పంచాయతీలో గురువారం గోవిందాయిపల్లి తాండ మాజీ సర్పంచ్ రాములు నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాములు నాయక్ మాట్లాడుతూ.. గోవిందాయిపల్లి తాండ నుండి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఏడుగురు బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకున్నట్లు కడ్తాల్ మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్ ఆద్వర్యంలో భారీగా చేరడం జరిగిందని పలు వార్తాపత్రికల్లో రావడం జరిగింది. కానీ బీఆర్ఎస్ పార్టీలో చేరిన వాళ్ళు కాంగ్రెస్ పార్టీ వారు కారని, వాళ్లలో నలుగురు బీఆర్ఎస్ పార్టీ వారని, ముగ్గురు బీజేపీ పార్టీ వారని తెలిపారు. బీఆర్ఎస్లో చేరిన వారందరికీ కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని అన్నారు. మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్ అలాంటి వారికి కండువాలు కప్పుతూ ఆనందం



పొందుతున్నారని రాములు నాయక్ మండిపడ్డారు. కానీ కాంగ్రెస్ పార్టీ వాళ్లు ఎవ్వరూ చేరలేదని మాజీ జడ్పీటీసీ వాస్తవాలు తెలుసుకునీ పత్రిక ప్రకటన చేయాలని, ఇకముందు ఇలాంటి అసత్య ప్రకటనలు మానుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎవరు బీఆర్ఎస్ లో చేరరని, బీఆర్ఎస్ పార్టీ వాళ్లకే కండువాలు కప్పి మళ్లీ మళ్లీ చేర్చుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమములో గోవిందాయి పల్లి కాంగ్రెస్ నాయకులు నిరంజన్ నాయిక్, బాస్కర్, పాండు,హనమా, సికిందర్,శ్రీను, ప్రేమ్ చందర్, దామా మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# 24న కలెక్టరేట్‌ల వద్ద జర్నలిస్టుల ధర్నా

**- జయప్రదం చేయాలి టిడబ్ల్యూజేఎఫ్**

**- రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్**

**మేడ్చల్ ప్రతినిధి,ఫిబ్రవరి21,(నినాదం న్యూస్):** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 24న జరగనున్న కలెక్టరేట్ వద్ద ధర్నానుజర్నలిస్టులు జయప్రదం చేయాలని టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. జర్నలిస్టుల ప్రధాన సమస్యలైన ఇండ్ల స్థలాలు. అక్రిడిటేషన్ కార్డులు. హెల్త్ కార్డులు. పెన్షన్ స్కీమ్. చిన్న. మధ్యతరగ పత్రికలకు గుర్తింపు. జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం తదితర డిమాండ్లను గత దశాబ్ద కాలంగా జర్నలిస్టులు రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తులు పెడుతున్న పాలకులు పెడచెవిన బెడుతూ జర్నలిస్టుల సమస్య లను పరిష్కరించకుండా కాలం



గడుపుతున్నారని విమర్శించారు. 2014 సంవత్సరం నుండి తెలంగాణ రాష్ట్రంలో అధికారం చలాయించిన బీఆర్ఎస్ ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రయత్నించకుండా దాటవేస్తూ వచ్చిందని తప్పుపట్టారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి. అప్పటి పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను గుర్తుంచుకొని వాటిని పరిష్కరించడానికి వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అధికార ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఒకలా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. ఈనెల 24న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద జరిగే నిరసన కార్యక్రమాల్లో భాగంగా మేడ్చల్ కలెక్టరేట్ కార్యాలయం వద్ద చేపట్టనున్న భారీ ధర్నాలో జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని జర్నలిస్టుల సమస్యలపై జిల్లా కలెక్టర్ కి విజ్ఞాపన పత్రం అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకుగాను మేడ్చల్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుండి పెద్ద సంఖ్యలో కలెక్టర్ కార్యాలయం వద్ద జరగనున్న ధర్నాను విజయవంతం చేయడానికి కృషి చేయాలని ఆయన కోరారు.

# మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి పై జగదీష్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

**-తెలంగాణ ఉద్యమకారుడు కాంగ్రెస్ నాయకులు రాయపూడి వెంకటనారాయణ**



**కోదాడ, ఫిబ్రవరి 21(నినాదం న్యూస్):** మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి నీటిపారుదల , పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పై చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని తెలంగాణ ఉద్యమ నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయపూడి వెంకటనారాయణ అన్నారు శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కృష్ణాజిల్లాలో అన్యాయం జరిగింది అని 2015 లో జరిగిన జలశక్తి సమావేశంలో ఏపీకి 512 టిఎంసిలు తెలంగాణకు 299 టీఎంసీలు కేటాయింపులను అంగీకరిస్తూ సంతకాలు చేశారని, కొనసాగింపుగా 2016 లోను సంతకాలు చేశారని గుర్తు చేశారు. ఏపీ ప్రభుత్వం కృష్ణాజిల్లాలను అక్రమంగా తరలించుకపోవడంపై మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నారని తెలిపారు. నీటి కేటాయింపులో తెలంగాణకు దక్కాల్సిన వాటాపై ఉత్తంకుమార్ రెడ్డి అలుపెరగని పోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు. నిత్యం రైతుల కోసం పరితపించే వ్యక్తిపై కావాలని బురదజల్లే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. పదేళ్ల అధికారంలో ఉండి తెలంగాణకు అధికార గీతాన్ని లేకుండా చేశారని ఎద్దేవా చేశారు. అన్ని వర్గాల ప్రజలను విస్మరించిన పార్టీ మీ టీఆర్ఎస్ పార్టీ అని, తెలంగాణ ఉద్యమం కోసం ఉద్యమించిన ఉద్యమకారులను పట్టించుకోని ప్రభుత్వం మీదని మీరా...! కాంగ్రెస్ ను విమర్శించేది అని సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఉద్యమకారుల పాత్ర కీలకమైనదని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యమకారులను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మాటలు చెప్పి తీరా గెలిచాక ఉద్యమకారుల ఊసు లేకుండా పాలన కొనసాగించిన ఘనత మీద అన్నారు. మీ పార్టీ అధికారంలోకి రావడంలో కూడా ఉద్యమకారులు కృషి చేశారని, కానీ మీరు అధికారమే పరమావధిగా అని వర్గాలను విభజించి పాలించారన్నారు.మరల తిరిగి తెలంగాణలో నీటి విషయంలో తెలంగాణ సెంటిమెంటును రెచ్చగొట్టి అధికారంలోకి రావాలని దిగజారిన రాజకీయాలు చేస్తున్నది మీరని ప్రజలు ఇకపై మీ మాటలను వినేపరిస్థితిలో లేరని పేర్కొన్నారు. ఇటువంటి ఆరోపణలు చేస్తే సహించేది లేదని తక్షణమే మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి పై చేసిన వ్యాఖలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# మీడియాపై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి



**కోదాడ, ఫిబ్రవరి 21 (నినాదం న్యూస్):** ఆధారాలతో వార్తలు రాస్తే జీర్ణించుకోలేక మీడియాపై కావాలని అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, పత్రికలను కించపరిచే విధంగా మాట్లాడడం రామగుండం ఎమ్మెల్యే అనుచరులకు తగదని తక్షణమే వారి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని సూర్యాపేట జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కారింగుల అంజన గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కోదాడ పట్టణంలో మాట్లాడుతూ.... ప్రజా సమస్య ఉంటేనే పక్క ఆధారాలతో పత్రికలు వార్తలు రాస్తాయన్నారు. అక్రమాల పైన రాసేవి ఇన్వెస్టిగేషన్ స్టోరీలని, ఇవి వారి సొర్సును బట్టి పత్రికల రాస్తాయని తెలిపారు. ప్రెస్ మీట్ లాగా అందరూ కలిసి ఒక దగ్గర కూర్చొని రాయరని, పక్క సమాచారం ఉంటేనే పూర్తి ఆధారాలతో వార్తల ప్రచురిస్తారని గుర్తు చేశారు. రాజకీయంగా పరంగా ఏమైనా ఉంటే మీరు మీరు చూసుకోవాలి కాని, పరిధి దాటి మీడియాపై దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. తక్షణమే మీడియాపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా మీడియా పవర్ ఏంటో చూపిస్తామని హెచ్చరించారు.

# బిజెపి అభ్యర్థి గెలుపు కోసం ముమ్మర ప్రచారం



చింతపల్లి, ఫిబ్రవరి 21(నినాదం న్యూస్) బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సర్వోత్తమ్ రెడ్డి గెలుపు కోసం మండల బిజెపి శాఖ ఆధ్వర్యంలో మండల వివిధ గ్రామాల్లో శుక్రవారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు.మండలంలోని గొడకొండ్ల, కుర్మేడు, కుర్మపల్లి, వింజమూరు, గ్రామాల్లోని పాఠశాల ఉపాధ్యాయులను కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సర్వోత్తమ్ రెడ్డి గెలుపు కోసం మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి సమ్మిడి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు మార్గదర్శకం వహించే దిశగా భారతదేశాన్ని తీసుకుపోతున్నటువంటి ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో అన్ని ఎన్నికలు కూడాప్రజల ఆశీస్సులతో విజయపథం లో నడుస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో దక్షిణ భారత రాష్ట్రాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలో కూడా భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తుందని తెలంగాణలో జరుగుతున్నటువంటి మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలుస్తున్నారనిఆయన అన్నారు, ప్రధాన పార్టీలకు సంబంధించినటువంటి అభ్యర్థులను పెట్టకుండా ముందే ఓటమిని అంగీకరించారని ఆయన అన్నారు. అదేవిధంగా విజ్ఞులైన ఉపాధ్యాయులు దేశ భవిష్యత్తు దృష్ట్యా భారతీయ జనతా పార్టీ బలపరిచిన పులి సర్వోత్తమ్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు తో గెలిపించాలని కోరారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దావ శ్రీనివాస్,మండల అధ్యక్షులు సముద్రాల నగేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి చనమోని రాములు , మాజీ ఎంపీటీసీ ఎగిరిశెట్టి అనిత శ్రీశైలం,సీనియర్ నాయకులు కనిగిరి గోవర్ధన్, కుక్కడపు రామకృష్ణ, రాజేష్ సాగర్, బాల్ జంగయ్య గౌడ్, కట్ల సైదులు, గొడుగు శ్రీనివాస్ యాదవ్, బజారు, మహేష్, గోవింద్ రాజు , తదితరులు పాల్గొన్నారు.

# చికిత్స పొందుతూ యువకుడి మృతి



**చౌటుప్పల్, ఫిబ్రవరి 21 (నినాదం న్యూస్):** రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతున్న యువకుడు మృతిచెందినట్లు సీఐ మన్మధకుమార్ తెలిపారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన ఆదిమల్ల సతీష్ (19) బ్రతుకు దెరువు కోసం పదిహేను సంవత్సరాల క్రితం తల్లిదండ్రులతో కలిసి చౌటుప్పల్ మండలంలోని తూఫ్రాన్‌పేట గ్రామంలో నివాసముంటున్నాడు. రోజువారి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈనెల 17న ఉదయం పనులకు వెళ్లి , 18న తెల్లవారుజామున తూఫ్రాన్‌పేట గ్రామ శివారున నడుచుకుంటూ వస్తుండగా రోడ్డు దాటే క్రమంలో గుర్తు లేని వాహనం ఢీకొట్టింది. ఈసంఘటనలో గాయపడిన సతీష్‌ను హైదరాబాద్ లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందినట్లు సీఐ తెలిపారు.

## టీయుడబ్ల్యూజే(ఐజెయు) 2025డైరీ ఆవిష్కరణ



**కరీంనగర్, ఫిబ్రవరి 21(నినాదం న్యూస్ ):** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని సుందరగిరి శ్రీకోరమీసా లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం టీయుడబ్ల్యూజే(ఐజెయు) 2025డైరీలను శుక్రవారం ఆవిష్కరించారు.ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం డైరీలను జిల్లా నాయకులతో కలిసి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ డెవలప్మెంట్ కమిటీ సభ్యుడు మారుతి ప్రకాష్ (నమస్తే తెలంగాణ),దాడుల కమిటీ జిల్లా కన్వీనర్ జేరుపోతుల వెంకట స్వామి(ఆంధ్రజ్యోతి),యూనియన్ మండల కన్వీనర్ పత్తెం రమేష్ పటేల్(పీఆర్పీ న్యూస్ ఛానల్ సీఈవో),జిల్లా కార్యవర్గ సభ్యుడు శేషం సింహాచార్యులు(మనం), మండల కో కన్వీనర్ గాదె రఘునాథ్ రెడ్డి(ఆంధ్రప్రభ),జేరుపోతుల సదానందం (సూర్య),పత్తెం శ్రీనివాస్(మన తెలంగాణ), ఎనగందుల అశోక్(తెలంగాణ పత్రిక ),బుల్లి రంజిత్(ప్రజా జ్యోతి),బండారి అజయ్ సుంకే సుధాకర్(సామాజిక తెలంగాణ)భోజనపల్లి సాయి చరణ్( గ్రామ దండోరా),నాంపెల్లి సురేష్(జన సముద్రం),తాళ్లపల్లి తిరుపతి(ఆర్టిఐ),తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీకి మహిళా ముఖ్యమంత్రి కావడం అభినందనీయం...

**-రేఖా గుప్తాకు ఆర్య వైశ్య సంఘం నాయకుల అభినందనలు**

**-కులదేవత కన్యక పరమేశ్వరి దేవికి పాలాభిషేకం...**



**కోదాడ, ఫిబ్రవరి 21 (నినాదం న్యూస్):** దేశ రాజధాని ఢిల్లీకి ఆర్యవైశ్య కులానికి చెందిన మహిళ రేఖా గుప్తా ముఖ్యమంత్రి కావడం నిజంగాఅభినందనీయమని, కోదాడ పట్టణ ఆర్య వైశ్య సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఢిల్లీ పీఠానికి మహిళ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా కోదాడ పట్టణంలో వంగవీటి శ్రీనివాసరావు, ఓరుగంటి పురుషోత్తం, జల్లా జనార్దన్ ఆధ్వర్యంలోఆర్యవైశ్యుల కులదేవత కన్యకా పరమేశ్వరి వాసవిదేవి అమ్మవారి చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. అనంతరం బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ...మహిళలకు సముచిత స్థానం కల్పించడంలో బిజెపి పార్టీ ముందుంటుందన్నారు. హిందూ భావజాలాన్ని, సనాతన ధర్మాన్ని పాటించే ఏకైక పార్టీ బిజెపి మాత్రమే అన్నారు. గత కొంతకాలంగా ఢిల్లీ అవినీతి రాజకీయాలతో అభివృద్ధి లేక కుంటూ పడిందని దేశ రాజధాని అభివృద్ధి నోచుకోకపోతే ప్రపంచవ్యాప్తంగా ఆ ప్రభావం పడుతుందని, ఢిల్లీ ప్రజలు మేల్కొని బిజెపి పార్టీకి ఓటు వేసి అభివృద్ధి చేసే బిజెపికి అవకాశం కల్పించారని పేర్కొన్నారు. తెలంగాణలో కూడా బిజెపి విజయకేతనం ఎగరవేయబోతుందని, త్వరలో జరిగే స్థానిక సంస్థలతోపాటు భవిష్యత్తులో జరిగే సార్వత్రిక ఎన్నికలలో కూడా బిజెపి పార్టీ సత్తా ఏంటో చాటుతామన్నారు. త్వరలో జరగబోయే మున్సిపాలిటీ ఎన్నికలలో కూడా కోదాడ పట్టణంలో పలు వార్డులలో ఆర్యవైశ్య సంఘం సభ్యులకు అవకాశం కల్పించాలని తప్పనిసరిగా గెలిపించి చూపిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో రామ్మూర్తి నాగేశ్వరరావు సతీష్ సుధాకర్ కుక్కడపు బాబు, చల్లా శేఖర్, చల్లా వెంకటేశ్వర్లు, వెంపటి రంగారావు, ఓరుగంటి కిట్టు, రవి ,హనుమంతరావు, వినాయకరావు, అప్పారావు, ఈశ్వరరావు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

**ములుగు ప్రతినిధి, (నినాదం):** ఫిబ్రవరి 27న నిర్వహించనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం, వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సంబంధించిన ఏర్పాట్లుపై అన్ని ఆయా జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీ లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, పోలింగ్ స్లిప్పులు పంపిణీ పూర్తి చేయాలని అన్నారు. పోలింగ్ ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. జిల్లాలలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటరు పాటించాల్సిన నియమాలు వివరాలు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా ఎన్నికల అధికారి దివాకర టి.ఎస్., ఓ ఎస్ డి మహేష్ బాబా సాహెబ్ గీతే, ఆర్డీఓ వెంకటేష్ పాల్గొన్నారు.

జిల్లాలో 70శాతం పోలింగ్ స్లిప్పుల పంపిణీ పూర్తి...జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

జిల్లాలో పోలింగ్ స్లిప్పులు పంపిణి 70 శాతం జరిగిందని, శనివారం వరకు మిగిలిన 30 శాతం పూర్తి చేస్తామని జిల్లా ఎన్నికల అధికారి దివాకర టి.ఎస్. తెలిపారు. జిల్లా లో 9 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, 12 పీవో లు, 12 ఏ పీవో లు,12 ఓ పీవో లు , 11 మైక్రోఆబజర్వర్లు విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. సిబ్బందికి మొదటి విడత, రెండో విడత శిక్షణ నిర్వహించామని తెలిపారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలను కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. 25 పోలింగ్ బాక్స్ లు సిద్ధం చేసినట్లు తెలిపారు. పోలింగ్ మెటీరియల్ రవాణాకు రెండు రూట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వీడియో సమావేశంలో తహసీల్దార్ విజయ భాస్కర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సలీమ్ , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ మాయాజాలంలో దివాళ తీస్తున్న రైతులు



**వరంగల్ ఫిబ్రవరి21 (నినాదం న్యూస్ ) :** రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలను మార్కెట్ మాయాజాలంలో సరైన గిట్టుబాటు ధర రాక దోపిడికి గురవుతూ దివాలా తీస్తున్నారని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ ఏఐకేఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ రెడ్డి హంసారెడ్డి అన్నారు. శుక్రవారం అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకెఎఫ్), తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం ఖమ్మం ,మహబూబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్లను సందర్శించి రైతుల పంటలు కొనుగోళ్ళను పరిశీలించి రైతుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఆయా మార్కెట్ చైర్మన్లు సిబ్బందితో మార్కెట్ వసతులపై చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు రైతు సంఘం పెద్దారపు రమేష్ సోమిడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు పండించే అన్ని పంటలకు శాస్త్రీయ పద్ధతిలో నిర్ణయించకపోవడం వల్ల దళారులు వ్యాపారులు కుమ్మక్కై అతి తక్కువ ధర కొనుగోలు చేస్తున్నారన్నారు. దీంతో పెట్టిన పెట్టుబడి సైతం రాక రైతులు ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేయబడుతున్నారన్నారు. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమే మిర్చి పండించిన రైతులని ధరలు భారీగా పడిపోవడంతో తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాని పరిస్థితులలో మిర్చి రైతులు ఆందోళనతో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్ ఎనుమాముల మార్కెట్లో సరైన మార్కెట్ ధర రావడంలేదని దోపిడీ ఎక్కువగా ఉన్నదని చాలామంది రైతులు ఖమ్మం మార్కెట్ రావడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. కేసముద్రం మార్కెట్లో ఈనామ్ విధానంతో పంటల కొనుగోళ్ళ వల్ల రైతులకు మేలు జరుగుతుందని పాలకులు చెప్పినప్పటికీ ఆచరణలో అందుకు విరూద్ధంగా నడుస్తుందన్నారు. నూతన వ్యవసాయ మార్కెట్ విధానం అమలు అయితే ప్రభుత్వ మార్కెట్ సిస్టం దెబ్బతిని మార్కెట్ వ్యవస్థ పూర్తిగా కార్పోరేట్ శక్తుల చేతుల్లోకి వెళుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర రావాలన్నా ఉత్పత్తి ఖర్చులు తగ్గాలన్న మార్కెట్లో కనీస వసతులు ఉండాలన్న రాజకీయాలకతీతంగా ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు. రైతాంగ సమస్యలపై ఉద్యమ కార్యాచరణ చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ సందర్శన బృందంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ రెడ్డి హంసారెడ్డి తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఓదేల రాజన్న శ్రీనివాస్ లింగయ్య వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలి




**ములుగు ప్రతినిధి, (నినాదం న్యూస్):** జిల్లాలో మాదకద్రవ్యాల నిషేధాన్ని పగడ్బందీగా అమలు చేయాలని, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై జిల్లాలో ప్రతి వారం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ తన ఛాంబర్ లో మాదకద్రవ్యాల నిషేధం ( నార్కోటిక్ డ్రగ్స్ )పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు జరగకుండా వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. జిల్లాలోని అన్ని జూనియర్, డిగ్రీ కళాశాలలో యా%శీ%టీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేశారా..లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. యా%శీ%టీ డ్రగ్ కమిటీల ద్వారా మాదకద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఉన్నత పాఠశాలలోనూ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. టాస్క్ ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు డ్రగ్స్ పై క్షేత్రస్థాయిలో నిఘా పెట్టాలని అన్నారు. కేవలం పోలీసు శాఖ మాత్రమే కాకుండా ఆబ్కారీ శాఖ అధికారులు కూడా మాదక ద్రవ్యాల నిషేధంపై కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. అలాగే జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా ఇంటర్ ఎడ్యుకేషన్ అధికారి నేతత్వంలోనూ ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. జిల్లా వైద్యశాఖ అధికారులు సైతం ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల నెలవారి సమావేశాలలో డ్రగ్స్ నిషేధం గురించి తెలిపి క్షేత్రస్థాయిలో వారి ద్వారా ప్రజలకు అవగాహన కల్పించేలా విస్తృతంగా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇక ముందు జరిగే యాంటి నార్కోటిక్ సమావేశాలకు ఆయా శాఖల ఆధ్వర్యంలో డ్రగ్స్ నిషేధంపై నిర్వహించిన కార్యక్రమాల నివేదికను తయారుచేసి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. మాదకద్రవ్యాలను జిల్లాలో పూర్తిగా నిషేధించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వెంకటేష్, డి సి ఆర్ బీ డీఎస్పీ కిషోర్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి, డిఇఓ వైద్య ఆరోగ్యశాఖ అధికారి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు పరామర్శ...



**ములుగు ప్రతినిధి, (నినాదం):** మాతృవియోగం పొందిన జిల్లా అడిషనల్ కలెక్టర్ చీమలపాటి మహేందర్‌జీ ని ఆరె సంఘం నాయకులు పరామర్శించారు. ఇటీవల అడిషనల్ కలెక్టర్ మాతృమూర్తి మృతి చెందగా శుక్రవారం ఆయనను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరే సంఘం అధ్యక్షులు ల్యాధ శ్యామ్ రావు, ఉపాధ్యక్షులు తిప్పారపు కిషన్, మండల ఆరే సంఘం నాయకులు హుస్సేన్ పల్లి గోపి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ముత్యాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఊరంతా ఏకమై... వానరానికి ఘనంగా శ్రద్ధాంజలి..

## -భారీ స్థాయిలో దశదినకర్మ కార్యక్రమం అన్నదానం పెట్టి అభిమానం చాటుకున్న గుడిబండ గ్రామస్తులు



**కోదాడ, ఫిబ్రవరి 21(నినాదం న్యూస్):** సాటి మనిషి చనిపోతూనే పట్టించుకోని రోజులువి. నడిరోడ్డుపై కత్తులతో పొడిచిన మనకేం సంబంధం లేదులే అని సినిమా చూసినట్టు చూసి వెళ్ళిపోయే సమాజంలో జీవిస్తున్నం. ఇటువంటి ప్రస్తుత రోజులలో కూడా ఇంకా మనుషులలో మానవత్వం బ్రతికే ఉందని సమాజానికి చాటి చెప్పారు కోదాడ మండలానికి చెందిన గుడిబండ గ్రామస్తులు. తమ గ్రామంలో కొన్ని రోజుల క్రితం ఎక్కడి నుంచో వచ్చినటువంటి వానరం అనారోగ్యానికి గురి కావడంతో స్పందించిన గ్రామస్తులు వైద్య అధికారితో వైద్యం చేయించారు. త్వరగా ఆరోగ్యంతో కోలుకుంటుందిలే అనుకున్న వానరం మృతి చెందింది. దీంతో గ్రామస్తులు ఊరేగింపుతో వానరానికి ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. కానీ అంతటితో ఊరుకోకుండా మనిషికి ఏ విధంగా అయితే దశదినకర్మ నిర్వహిస్తారో అదే రీతిలో గ్రామస్తులు ఏకమై చందాలతోటి శుక్రవారం గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో ఘనంగా వానరానికి దశదినకర్మ నిర్వహించారు. భారీగా గ్రామం మొత్తం అన్నదాన కార్యక్రమం నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. నోరులేని జంతువులపై కూడా ఆ గ్రామస్తులు చూపిస్తున్నటువంటి ప్రేమను, చేసినటువంటి కార్యక్రమాన్ని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అభినందిస్తున్నారు.

# రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



**చౌటుప్పల్, ఫిబ్రవరి 21 (నినాదం న్యూస్):** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని వలిగొండ క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందినట్లు సీఐ మన్మధకుమార్ తెలిపారు. చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన కొయ్యడ సత్యనారాయణ గత కొన్ని సంవత్సరా లుగా కుటుంబ సభ్యులతో హైదరాబాద్‌లోని నాగోల్ ఆనంద్‌నగర్‌లో నివాసముంటున్నారు. కొయ్యడ సత్యనారాయణ ఆమె భార్య కొయ్యడ నందిని(40)లు వలిగొండ మండలం గొల్లపల్లికి బంధువుల ఇంటికి వెళ్ళారు. తిరిగి శుక్రవారం హైదరాబాద్‌కు బైక్‌పై వెలుతుండగా చౌటుప్పల్ పట్టణంలోని వలిగొండ రోడ్డు క్రాస్ జాతీయ రహదారిపైకి వస్తుండగా కంటైనర్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ వెనుక నుండి వారిని ఢీకొట్టాడు. ఈసంఘటనలో నందిని అక్కడికక్కడే మృతి చెందగా సత్యనారాయణకు గాయాలయ్యాయి. నందిని మృతితో భర్త , కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# బిసి అభ్యర్థులను గెలిపించుకుందాం: వట్టే జానయ్య యాదవ్

**సూర్యాపేట ప్రతినిధి ఫిబ్రవరి 21 ( నినాదం న్యూస్) :** ఫిబ్రవరి 27 వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో బీసీ అభ్యర్థులను గెలిపించి బిసి వాదాన్ని నిలబెట్టాలని మాజీ డిసిఎంఎస్ చైర్మన్ వట్టే జానయ్య యాదవ్ కోరారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..... తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కుల గణనను నామమాత్రంగా నిర్వహించి బీసీలను అణిచివేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. బిసి విద్యార్థుల ఉన్నత విద్యకు 10 లక్షల రూపాయలను ఖర్చు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని పేర్కొన్నారు. 2029 సంవత్సరం లో తెలంగాణ రాష్ట్రానికి బీసీ అభ్యర్థి సీఎం కానున్నాడని అన్నారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి మిక్కిలినేని



పౌరాణిక, జానపద సాంఘిక నాటకాలలో స్త్రీ పాత్రలు పోషించి, అందరి మన్ననలను పొంద గలిగిన ప్రముఖ తెలుగు రంగస్థల, సినిమా నటుడు మిక్కిలినేని. అయితే రాధాకృష్ణ మూర్తి, చాలా మందికి చలన చిత్ర నటుడిగా తెలుసు. కొద్ది మందికి రంగ స్థల నటుడిగా తెలుసు. మరికొంత మందికి స్వాతంత్ర్య సమర యోధునిగా, నిజాం వ్యతిరేక ఉద్యమ కారునిగా తెలుసు. ఇంకొంత మందికి గ్రంథకర్తగా తెలుసు. కొందరికే కమ్యూనిస్టుగా బాగా తెలుసు. అందుకే "బహుముఖ ప్రజ్ఞాశాలి". అన్న మాటకు నిలువుటద్దంగా నిలిచారు మిక్కిలినేని. మిక్కిలినేని గా సుపరిచితులైన మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి (జూలై 7, 1916 – ఫిబ్రవరి 22, 2011) ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలంలోని లింగాయ పాలెంలో 1914, జులై 7న జన్మించారు. కోలవెన్నులో అమ్మమ్మ దగ్గర పెరిగిన ఆయన నాటకాలపై మక్కువతో రంగస్థలం వైపు మళ్లారు. జానపద కళారూపాలతో ప్రభావితులై కపిలవాయి రామనాథశాస్త్రి శిష్యులైనారు. జానపద, పౌరాణిక నాటకాల్లో పురుష, స్త్రీ పాత్రలను ధరించి ప్రేక్షకులను ఆకట్టు కున్నారు. బ్రిటీష్ పాలకుల వ్యతిరేక పోరాటాలు చేశారు. హేతువాద ఉద్యమాలలో క్రియాశీల కార్యకర్తగా ఎన్నో ఉద్యమాలను నిర్వహించి, ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు సహాయ పడ్డారు. అన్యాయం జరుగుతున్న చోట న్యాయ పోరాటం చేయాలని గళం విప్పిన ఆయన...ప్రజానాట్య మండలికి వ్యవస్థాప సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించారు. స్వాత్రంత్ర పోరాటాల్లో పాల్గొని ఐదుసార్లు జైలుకు వెళ్లారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నిజాం పాలనకు వ్యతిరేకంగా కొంతకాలం పోరాడారు. పల్నాటి యుద్ధం, బొబ్బిలి యుద్ధం, కాటమరాజు కథ తదితర 30 చారిత్రక, జానపద కళారూపాల ద్వారా ప్రజలను సమీకరించిన ప్రజానాట్య మండలి 1940లలో నిషేధానికి గురైంది. ఫలితంగా కొందరు సినీ రంగాన్ని ఆశ్రయించారు. వారిలో మిక్కిలినేని రాధాకృష్ణ మూర్తి వంటి ముఖ్యులున్నారు. సహజంగా సినిమా రంగంపై ఆసక్తితో మిక్కిలినేని అలా ఆ దారి పట్టారు. ప్రముఖ దర్శకుడు రాఘవేంద్రరావు తండ్రి కె.ఎస్.ప్రకాశరావు దర్శకత్వం వహించిన 1949లో 'దీక్ష' సినిమాతో సినిమా కెరీర్‌ని మొదలు పెట్టారు మిక్కిలినేని. 1949లో కేఎస్ ప్రకాశ రావు దీక్షతో మొదలై బాలకృష్ణ సినిమా భైరవద్వీపం వరకూ 400లకు పైగా తెలుగు చిత్రాల్లో నటించి, పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాలలో భిన్న విభిన్న పాత్రలు ధరించారు. ఐదుసార్లు జైలుకు వెళ్లిన స్వాతంత్ర్య సమర యోధుడు, కమ్యూనిస్టు. గ్రంథాలయ, హేతువాద ఉద్యమాలలో క్రియాశీల కార్యకర్త, నాటకరంగ నటులు, 'ఆంధ్రుల నటరత్నాలు' తదితర రచనలను చేసినవారు, ప్రజానాట్య మండలి వ్యవస్థాపక సభ్యులు, 'తెలుగువారి జానపద కళారూపాలు' గ్రంథ రచయిత. 'మన పగటి వేషాలు', 'ఆంధ్రుల నృత్యకళావికాసం' తదితర పరిశోధనాత్మక గ్రంథ రచయిత మిక్కిలినేని. ఆయన వంటి నూనూగు మీసాల కుర్రాళ్లను అప్పటి సంక్షుభిత సమాజం రాటుదేల్చింది. అంతర్జాతీయంగా ఫాసిస్టులకు, దేశీయంగా బ్రిటిష్ – నైజాం నియంతృత్వానికి, ఆంధ్ర ప్రాంతంలో జమీందారీల అణచి వేతకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ రూపొందించిన కళాసైన్యం ప్రజానాట్య మండలి. ఆ వాతావరణంలో భార్య సీతా రత్నాన్ని మిక్కిలినేని ఎనభై ఏళ్లనాడు నాటక రంగానికి పరిచయం చేసిన ప్రజా కళాకారులు. కపిలవాయి రామనాథ శాస్త్రి శిష్యరికంలో 'మిక్కిలినేని' ఇంటి పేరుగల వారికి గర్వకారణంగా బహుముఖంగా ఎదిగి, ఫిబ్రవరి 22, 2011 తేదీన మంగళవారం మిక్కిలినేని విజయవాడలో తన 95వ ఏట మరణించారు. నాటక రంగానికి చెందిన 400 మంది కళాకారులను 'నటరత్నాలు' శీర్షిక ద్వారా తెలుగు పాఠకులకు పరిచయం చేసిన ప్రత్యేకత మిక్కిలినేనిదే. వీధినాటకాలు – జముకుల కథలు – బుర్రక్రథలు ప్రదర్శిం చిన పాత రోజులను మరవ కుండా, పాత స్నేహితాలను పునరావిష్క రించుకుంటూ తెలుగు నేల నాలుగు చెరగులా తిరిగి స్వయంగా తెలుసుకున్న సమాచారంతో 'ఆంధ్ర నాటకరంగ చరిత్ర' రచించారు. నటరత్నాలు (1980, 2002)ఆంధ్ర నాటకరంగ చరిత్ర, తెలుగువారి జానపద కళా రూపాలు, ప్రజా పోరాటాల రంగస్థలం, ఆంధ్రుల నృత్య కళా వికాసం, తెలుగు వారి చలన చిత్ర కళ తదితర రచనలు చేశారు.నాటకాల్లో అనుభవం ఉండటంతో ఏ పాత్ర ఇచ్చినా ఆయన లీనమై నటించే వారు. దీంతో దర్శక నిర్మాతలు ఆయన కోసమే ప్రత్యేకంగా పాత్రలు రాసేవారు. ఐదు దశాబ్దాలపాటు సినీరంగంలో సాంఘిక, జానపద, పౌరాణిక పాత్రలను పోషించిన ఆయన సుమారు 400 చిత్రాలలో నటించారు. భైరవద్వీపం ఆయన చివరి చిత్రం. నందమూరి తారక రామారావుతోనే ఏకంగా 150 సినిమాల్లో నటించడం ఓ రికార్డు. మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి మరణంతో జీవించి వున్న తెలుగు సినీ కళాకారుల్లో తానే పెద్ద" అన్నారు డా. అక్కినేని నాగేశ్వరరావు. నాటక రంగానికి, జానపద కళలకు వీరు చేసిన సేవలకు ఆంధ్ర విశ్వ విద్యాలయం కళా ప్రపూర్ణ పురస్కార మిచ్చింది. తెలుగు విశ్వ విద్యాలయం ఎన్.టి.ఆర్ ఆత్మగౌర పురస్కారంతో ఆయనను సన్మానించింది. 1999లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి సాంస్కృతిక రంగంలో విశిష్ట పురస్కారం లభించింది.

# యువతను భాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దే స్కౌట్స్ అండ్ గైడ్స్

స్కౌటింగ్ ఆలోచనలకు తుది రూపమిచ్చి వ్యవస్థాపకుడిగా పేరుగాంచిన రాబర్ట్ బాడెన్ పోవెల్‌తో పాటు వారు సహధర్మచారిణి ఓలావె బాడెన్ పోవెల్ జన్మదినం 22 ఫిబ్రవరి (1857) సందర్భంగా ప్రతి ఏట 22 ఫిబ్రవరిన ప్రపంచవ్యాప్తంగా విద్యాలయాల్లో "ప్రపంచ స్కౌట్స్ దినోత్సవం లేదా వరల్డ్ స్కౌట్స్ డే" పాటించడం ఆనవాయితీగా మారింది. విశ్వ స్కౌటింగ్ సంఘాలతో పాటు భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థలు ఘనంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నాయి. 1908లో బాయ్ స్కౌట్స్‌ను ప్రారంభించిన రాబర్ట్ బాడెన్ పోవెల్, 1910లో గర్ల్స్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను స్థాపించారు. విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, మానసిక పరిపక్వత, దేశభక్తి, వ్యక్తిత్వ విస్తారం, ప్రతికూలతలును ఎదుర్కోవడం, ఆధ్యాత్మిక అనుభూతులు పెంచడమే లక్ష్యంగా పాఠశాల బాలలకు సైనిక శిక్షణ తరహాలో స్కౌట్స్ అండ్ గైడ్స్ గొడుగు కింద శాస్త్రీయ శిక్షణను అనాదిగా అందించడం జరుగుతున్నది. ప్రపంచ స్కౌట్స్ దినోత్సవంలో భాగంగా విద్యార్థులు, స్కౌట్ ఆఫీసర్లు, విద్యాలయాలు ఘనంగా వేడుకలను నిర్వహిస్తున్నారు.

**భారత్‌లో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం :** భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విశిష్ట సేవలను గుర్తించిన ఐరాస ప్రస్తుతిస్తూ "శాంతి దూత లేదా సందేశకులు"గా గుర్తించడం ముదావహం. భారత ప్రభుత్వ చొరవతో 1950లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రారంభం కావడంతో పాటు 1951లో ఆల్ ఇండియా గర్ల్స్ గైడ్స్ సంస్థ ఏర్పడింది. నేడు దేశవ్యాప్తంగా 57 లక్షల పిల్లలు స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణను పొందుతున్నారు. భారత్ స్కౌట్స్‌లో 3 – 5 ఏండ్ల పిల్లల్ని బన్నీస్‌గా, 5 – 10 ఏండ్ల విద్యార్థులను కబ్స్‌గా, 10 – 17 ఏండ్ల విద్యార్థులను స్కౌట్స్‌గా, 17 – 25 ఏండ్ల యువతను రేంజర్స్‌గా పిలవడం జరుగుతుంది.

**తెలుగు రాష్ట్రాల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ :**

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 18,510 మంది స్కౌట్స్, 15,150 మంది గైడ్స్‌గా శిక్షణ పొందుతుండగా, తెలంగాణలో 9,145 మంది స్కౌట్స్, 6,489 మంది గైడ్స్ శిక్షణ పొందుతున్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ తీసుకున్న విద్యార్థులు ఇతర విద్యార్థులతో పోల్చితే స్పష్టమైన గుణాత్మక తేడాను గమనించవచ్చు. బాధ్యత కలిగిన రేపటి పౌర సమాజ స్థాపనకు నేటి బాలలను తగు రీతిలో మలుచుకోవడానికి ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్‌లతో పాటు స్కౌట్స్ అండ్ గైడ్స్ కూడా అమూల్య సేవలను అందించడం హర్షణీయం. 22 ఫిబ్రవరి రోజున "ప్రపంచ ఆలోచనా దినం లేదా వరల్డ్ థింకింగ్ డే"ను కూడా పాటించడం జరుగుతుంది. గర్ల్ గైడింగ్, గర్ల్ స్కౌటింగ్ చిన్నారులను వినియోగించుకొని వరల్డ్ థింకింగ్ డే నిధులను కూడా సమీకరించడం జరుగుతుంది. వరల్డ్ థింకింగ్ డే ఇతివృత్తంగా "అవర్ స్టోరీ" అనే అంశాన్ని తీసుకొన్నారు.

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి, 9949700037**

# బుర్రకథా పితామహుడు నాజర్



ప్రాచీన జానపద కళారూపమైన బుర్రకథకు కొత్త జీవం పోసి, మెరుగులు దిద్ది, ప్రత్యేక ఆహార్యంతో తగిన హావ భావలతో ఎన్నో ప్రదర్శనలిచ్చి బుర్రకథా ప్రక్రియకు విస్తృత ప్రచారం కల్పించిన బుర్రకథా పితామహుడు నాజర్, నటుడు, ప్రజారచయిత, గాయకుడు. " ఈ గండపెండేరాలూ, ఊరేగింపులూ, సన్మానాలూ, పద్మశ్రీలూ అన్నీ కలిపి, నాకు జనం వేసే ఒక్క ఈలతో సాటి కాదు" అని తన కళను ప్రజా ప్రయోజనానికే అంకితం చేసిన ప్రజా కళాకారుడు. అంగాంగ విన్యాసాల ద్వారా ఆటపాట ద్వారా జాతిని మేల్కొలిపి ఉత్తేజపరిచిన గొప్ప ప్రతిభాశాలి షేక్ నాజర్. నాజర్ ప్రతిభకు ముగ్ధుడైన సినీ సంగీత దర్శకులు సాలూరు రాజేశ్వరరావు సినీరంగంలో స్థిరపడమని కోరినా, ఆ లోకం తన లోకం కాదని సవినయంగా చెప్పి, జనపదమే తన పథమని బుర్రకథలు చెప్పుకుంటూ జనంతో మమేకమై, జీవితాంతం ప్రజా కళాకారుడిగా కొనసాగిన ప్రజా గాయకుడు నాజర్. బుర్రకథా పితామహుడుగా పేరొందిన షేక్ నాజర్ (ఫిబ్రవరి 5, 1920 – ఫిబ్రవరి 22, 1997) బుర్రకథా కళాకారుడు, నటుడు, ప్రజా రచయిత, గాయకుడు. పద్మశ్రీ అవార్డు గ్రహీత. గుంటూరు జిల్లా పొన్నెకల్లు గ్రామంలో ఓ పేద దూదేకులముస్లిం కుటుంబంలో 1920, ఫిబ్రవరి 5 వ తేదీన షేక్ మస్తాన్, బీబాబీలకు దంపతులకు జన్మించారు. నాజరు పూర్తి పేరు "షేక్ నాజరు వలి". మహ్మదీయ సభ పేరిట నాటకా లాడి మంచిపేరు గడించారు. ఆయన కృష్ణలీలలో దేవకి, శ్రీ కృష్ణ తులాభారంలో రుక్మిణి, భక్త రామదాసులో ఛాందిని వంటి ఆడవేషాలు వేసి మెప్పించారు. పాదుకా పట్టాభిషేకంలో కైకేయి, ఖిల్జీ రాజ్యపతనంలో కమలారాణి పాత్రలు పోషించారు. పాఠశాల స్థాయిలో "ద్రోణ" పాత్రకు జీవం పోశారు. ఆర్యమత సిద్ధాంతం నచ్చి మాంసాహారం మానేశారు. నాస్తికుడయ్యారు. తెనాలిలోని "బాలరత్న నాటక సమాజం"లో ప్రారంభమైన నాజర్ కథాకథన ప్రస్థానం నాలుగు దశాబ్దాలు సాగింది. కమ్యూనిస్టు పార్టీలోచేరి ప్రజానాట్య మండలి వేదిక ద్వారా పార్టీ సిద్ధాంతాలను కార్యక్రమాలను బుర్రకథల ద్వారా ప్రచారం చేశారు. వీరిని 1940వ దశకంలో కమ్యూనిస్టు పార్టీ నెల జీతం మీద కథలు చెప్పించి పల్లెలలో తమ పార్టీ ప్రచారానికి ఉపయోగించు కున్నది. పల్నాటి యుద్ధం, వీరాభిమన్యు, బొబ్బిలి యుద్ధం, అల్లూరి సీతారామరాజు, ప్రహ్లాద, క్రీస్తు, బెంగాల్ కరువు మొదలగు ఇతివృతాలలో నమకాలీన రాజకీయాలు జోడించి బుర్రకథలు రూపొందించారు. పద్మశ్రీ నాజర్ జీవిత చరిత్రను అంగడాల వెంకట రమణమూర్తి... పింజారీ అనే పుస్తకంగా ప్రచురించాడు. కొంతకాలం విరసం సభ్యులుగా ఉన్నారు. అగ్గిరాముడు, బలేబావ, నిలువు దోపిడీ, పెత్తందార్లు, పుట్టిల్లు, మనుషులంతా ఒక్కటే – సినిమాల్లో నాజర్ బుర్రకథలు కన్పిస్తాయి. పూల రంగడు సినిమాలో "అక్కినేని"కి నేర్పించారు. చాలా మందికి ఈ గాంధర్వ విద్య నేర్పారు. ఆయన గళ గాంభీర్యాన్ని, మాధుర్యాన్ని గమనించి, "ఆసామీ" నాటకాన్ని రచించారు. ఆంధ్రనాటక కళాపరిషత్తు పోటీల్లో ఆసామీ నాటకం ప్రథమ బహుమతి పొందింది. నాజర్ ఏడుసార్లు జైలు జీవితాన్ని అనుభవించారు. ఆంధ్రనాటక అకాడమీ 1981లో "ఉత్తమ కళాకారుడు" అవార్డుతో సత్కరించింది. 1986 లో భారత ప్రభుత్వం "పద్మశ్రీ" బిరుదుతో నాజరును సత్కరించింది. రంగస్థల మహానటుడు బళ్లారి రాఘవా చార్యులు, నాజరు బుర్రకథ విని అమితానందంతో బళ్లారికి ఆహ్వానించడం, మద్రాసులో ప్రదర్శన చూచిన గోవిందరాజుల సుబ్బారావు నాజరుని అభినందిస్తూ కౌగిలించు కోవడం, ప్రముఖ పాత్రికేయుడు కె. అబ్బాస్ నాజరును "ఆంధ్ర అమరషేక్" అని అభివర్ణించడం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య నాజరు ప్రజా భాషకు ముగ్ధుడై "నా బిడ్డడు ఎంత ఎదిగిపోయాడో" అని ఆలింగనం చేసుకోవడం, నాజరు లోని కళా ప్రతిభకు తిరుగులేని నిదర్శనాలు. "నాటకాల్లో బుర్రకథ బ్రహ్మ నాజర్ దగ్గర శిక్షణ తీసుకోవటం నా నట జీవితానికి పట్టం కట్టింది" అని ప్రముఖ నటి జమున వ్యాఖ్యానించారు. గుంటూరుకు ఎన్‌టిఆర్ వచ్చినప్పుడు "నేను మీ అభిమానిని" అని నాజర్ చెపితే... "నేను మీ ఫాన్‌ను" అని ఎన్‌టిఆర్ చెప్పి అందరినీ ఆనంద పరిచారు. "హరికథకు ఆదిభట్ల ఎలాంటివాడో బుర్రకథకు నాజర్ అలాంటివాడు" అని ముదిగొండ శివప్రసాద్ తదితర ప్రముఖుల అభిప్రాయాలు ఉంటే నాజర్ గొప్పతనం స్పష్టం అవుతున్నది. కటిక పేదరికాన్ని మరణించే వరకు అనుభవించిన నాజర్ 1997, ఫిబ్రవరి 22 న అంగలూరులో మరణించారు.

## క్రేన్ కూలిన ఘటనలో చికిత్స పొందుతూ మరో వ్యక్తి మృతి



**భీమదేవరపల్లి ఫిబ్రవరి 21 (నినాదం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం లోని ముల్కనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల గట్ల నర్సింగాపూర్ లో గురువారం రోజు బావిలో కూడిక తీస్తుండగా ప్రమాదవశాత్తు క్రేజ్ బావిలో కూలిన ఘటనలో గండికోట ఎల్లయ్య అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా, గట్ల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన వేల్పుల వెంకటయ్య 55, అనే మరో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. 108 అంబులెన్స్ లో వెంకటయ్యను వరంగల్ లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. ఇద్దరు వ్యక్తుల మృతుతో గ్రామంలో విషాదం నెలకొంది. శుక్రవారం వెంకటయ్య మరణించిన ఘటనపై ముల్కనూర్ ఎస్సై సాయిబాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పల్లె పల్లెనా పట్టభద్రులను కలుస్తున్న ట్రస్మా నాయకులు

**పివీ స్వగ్రామంలో శేఖర్ రావు ను గెలిపించాలని ప్రచారం**



**భీమదేవరపల్లి ఫిబ్రవరి 21 (నినాదం న్యూస్):** ఎమ్మెల్సీ పట్టభద్రుల స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న ట్రస్మా రాష్ట్ర చీఫ్ అడ్వైజర్ యాదగిరి శేఖర్ రావును గెలిపించాలని భీమదేవరపల్లి మండల ట్రస్మా నాయకులు పల్లె పల్లెనా పట్టభద్రులను కలుస్తూ, శేఖర్ రావు గెలుపు కొరకు కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా ట్రస్మా నాయకులు మాట్లాడుతూ, మాజీ ప్రధాని పీవీ స్వగ్రామం వంగర, రత్నగిరి గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్టభద్రుల మండల కన్వీనర్ బేర యాదగిరి, చెప్యాల గోపాల్ రెడ్డి, కొండబత్తిని రాజేశం, మల్లేశం, అచ్చ అశోక్, పెగడపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అక్షయ్ జన్మదిన వేడుకలు




**మహేశ్వరం, ఫిబ్రవరి 21 (నినాదం న్యూస్)**కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండలం మైసిగండి గ్రామానికు చెందిన సభవాట్ నీలా ల లా (రమేశ్ ) నాయక్ కుమారుడు అక్షయ్, తాత నాయనమ్మ సభవాట్ కమ్లి సర్య నాయక్ ఆధ్వర్యంలో సొంతగృహంలో జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ముఖ్య అతిథిగా హాజరైన భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ సభావట్ దూదు చౌహాన్,రామావత్ రాజు నాయక్, కార్యకర్తలు అభిమానులు సభ్యులు యువకులు పెద్దలు నాయకులతో కలిసి ఆయనకు ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన తో కేక్ కట్ చేయించి తినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అందరి మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పెద్దలు స్నేహితులు బంధువులు స్థానిక నాయకులు అభిమానులు నాయకులు చిన్నలు పెద్దలు తదితరులు పాల్గొన్నారు

# బీఆర్ఎస్ హయాంలో రైతులు రాజులయ్యారు

**కాంగ్రెస్ పాలనలో రోడ్డున పడ్డారు - జిల్లా యువజన విభాగం బీఆర్ఎస్ నాయకులు**



**మహేశ్వరం, ఫిబ్రవరి 21 (నినాదం న్యూస్):** 60 సంవత్సరాల అసుర పాలన నుంచి విముక్తి కలిగించి,పది సంవత్సరాల పరిపాలనలో తెలంగాణ ఆత్మ గౌరవాన్ని నిలబెట్టిన బీఆర్ఎస్ నేతల గురించి స్థాయికి మించి కాంగ్రెస్ నేతలు విమర్శలు చేయడం విడ్డూరమని జిల్లా యువజన విభాగం బీఆర్ఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం కడ్తాల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ యువజన విభాగంజిల్లా నాయకుడు కంబాలపల్లి అంజి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 18న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారు చేపట్టిన రైతు దీక్ష కార్యక్రమం గురించి పలువురు కాంగ్రెస్ నాయకులు స్థాయికి మించి విమర్శించడం తగదని, గతాన్ని మరిచి విమర్శించడం విడ్డూరంగా ఉందని అన్నారు. 60 ఏళ్లు పరిపాలించిన కాంగ్రెస్ నాయకులకు రైతుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదని రైతు బంధు,రైతు బీమా లాంటి కార్యక్రమాలు ఎందుకు అమలు చేయలేదని ధ్వజమెత్తారు. కెసిఆర్ స్వయంగా రైతు,రైతుల పక్షపాతి, రైతుల కష్టనష్టాలు తెలిసిన గొప్ప అనుభవమున్న వ్యక్తి కాబట్టి దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలను తెలంగాణలో ప్రవేశపెట్టి ప్రజాభిమానాన్ని పొందారని అన్నారు. తెలంగాణలో రైతును రాజును చేసిన ఘనత కేసీఆర్ ది అని, రైతులను మోసం చేసి, వంచించి రోడ్డు పాలు చేసిన కీర్తి శిఖరాలు కాంగ్రెస్ నాయకులని అన్నారు. 60 రోజులుగా పాల బిల్లులు అందక పశువులకు పశుగ్రాసము, దాన కొనుగోలుకు పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే కాంగ్రెస్ నాయకులకు కనపడతలేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో ఉండేవిధంగా తీర్చిదిద్దితే, దొంగ మాటలు, మాయమాటలు, దొంగ హామీలు ఇచ్చి, ప్రజలను మోసం చేసి అధికారాన్ని చేజిక్కించుకొని, ఇచ్చిన హామీలు నెరవేర్చలేక 13 నెలల పరిపాలనలో తెలంగాణను తిరోగమనానికి నెట్టేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదని ధ్వజమెత్తారు. ఎన్నికలలో వృద్ధులకు, దివ్యాంగులకు ఇస్తామన్న 4000 వేలు,6000 వేలు పెన్షన్లు ఏమయ్యాయని అడిగారు. ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేశామన్న కాంగ్రెస్ నాయకులు మీరు నేటి వరకు నెరవేర్చిన హామీలపై కడ్తాల్ చౌరస్తాలో బహిరంగ చర్చకు సిద్ధమా అని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజల వద్దకు ఓట్ల కోసం వెళ్తే తరిమికొట్టే పరిస్థితి ఉందని గ్రహించి ఎన్నికలు నిర్వహించలేకపోతున్నారని అన్నారు. అధికార దాహం కోసం 420 హామీలు ఇచ్చి నేడు హామీల అమలులో విఫలమై ప్రజాగ్రహానికి లోనవుతున్న ప్రభుత్వం మీది కాదా అని ఆరోపించారు ఇప్పటికైనా ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేదంటే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు మహేష్, డాన్ శ్రీను, అంజి నాయక్ ,గ్రామ యూత్ ప్రెసిడెంట్ కొప్పు కృష్ణ, మూడ రవి,అంజాత్, గోపాల్,ప్రశాంత్, మొగిళ్ల శేఖర్, రాజు, ప్రేమ్ కుమార్,సిద్ధిగారి సురేష్, కృష్ణ ,రాజ,మహేష్, మోబిన్,సురేష్,కిషన్ నాయక్, సక్రునాయక్, శ్రీను, శ్రీకాంత్, నవీన్, బాలరాజు,శివ,శ్రీకాంత్ నాయక్,జంగయ్య, సాయి,శ్రీశైలం,తదితరులు పాల్గొన్నారు

# యశోదలో అరుదైన శస్త్ర చికిత్స

**వివరాలు వెల్లడించిన న్యూరో సర్జన్ డాక్టర్ కెఎస్ కిరణ్**




**నిజామాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 21 (నినాదం న్యూస్):** సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ వైద్యులు అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశామని యశోద హాస్పిటల్, డాక్టర్ న్యూరో సర్జన్ కే ఎస్ కిరణ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని యశోద హాస్పిటల్ కేర్ సెంటర్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు.యశోద హాస్పిటల్, కన్సల్టెంట్ న్యూరో సర్జన్ కిరణ్ శస్త్ర చికిత్సకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా డిచ్పల్లికి చెందిన ఫర్జానా బేగం అనే 52 సంవత్సరముల వయస్సుగల మహిళ తీవ్రమైన తలనొప్పి (పంటి భాగం, నుదురు, ముక్కు తదితర భాగాలు) ఇలా వచ్చినప్పుడల్లా అసహజ లక్షణాలతో యశోద హాస్పిటల్ సికింద్రాబాద్ కు వచ్చిందన్నారు. రమారమి నెలకు రెండు సార్లు తిమ్మిర్లు, చూపు మందగించడం, తెలియకుండా కిందపడిపోవడం జరిగేదని, ఇంకా కొన్నిసార్లు ముఖాకృతి మారటం, ముక్కు,నాలుక,దవడ పరిమాణం పెరగడం, పళ్ళ అరమరికలో మార్పు, మింగటంలో ఇబ్బంది, ఇతరత్రా సమస్యలు, చేతులు,వేళ్ళు వాపులు వంటి అనూహ్యమైన వ్యాధి లక్షణాలతో వచ్చిందని తెలిపారు. మేము ఆమెకు ఎం.ఆర్.ఐ. బ్రెయిన్ (ప్లెయిన్ అండ్ కాంట్రాస్ట్) చేయించి పెద్ద పిట్యుటరీ ట్యూమర్ గుర్తించడం జరిగింది.ఈ ట్యూమర్ ఉన్న గ్రోత్ హార్మోన్స్ సీక్రెషన్స్ వల్ల ఈ పై వ్యాధి లక్షణాలు కలిగాయి.నరానికి,నాడికి అతుక్కుని సంక్లిష్టంగా ఉన్న ఈ ట్యూమర్ను శస్త్ర చికిత్స సహాయంతో తొలగించాలని, రోగి తరపు బంధువులకు వివరించాము.ముందుగా పేషంట్ కు కొన్ని రకాల ఉపశమనం మందులతో వైద్యం ప్రారంభించాము. అవి కూడా ఇతర స్పెషలిస్ట్ ల సహాయంతో (ఇ.యన్.టి. సర్జన్,ఎండోక్రైనాలజిస్ట్), పి.పి.ఐ., కార్టిజోన్స్, యాంటియమటిక్స్ ఇతరత్రా బి.పి. మందులు వాడామన్నారు. ఈ శస్త్ర చికిత్స ద్వారా ట్యూమర్ను ట్రాన్స్ ఎండోస్కోపిక్, ట్రాన్స్నాజల్ పద్ధతిలో దాదాపు పూర్తిగా తొలగించడం జరిగింది. శస్త్ర చికిత్స అనంతరం మరల సి.టి. బ్రెయిన్ చేశామన్నారు. అందులో పూర్వపు లక్షణాలు, రక్తస్రావం,వాపు లాంటివి కనబడలేదు.న్యూరో హెచ్.డి. యు.లో ఒక రోజు ఉంచి,జనరల్ వార్డుకు మార్చడం జరిగింది.అసాధారణమైన ట్యూమర్ తో తీవ్రంగా బాధపడుతున్న రోగికి శస్త్ర చికిత్స నిర్వహించి నమశక్యం కాని ఫలితాన్ని రాబట్టామన్నారు.సర్జరీ అనంతరం రోగిని స్థిరమైన స్థితిలో డిశార్జ్ చేశాము. తలనొప్పి,సర్జరీకి ముందు ఉన్న సమస్యల నుండి దాదాపు ఉపశమనం లభించింది.శస్త్ర చికిత్సను డాక్టర్లు,కన్సల్టెంట్ న్యూరో సర్జన్ కె ఎస్ కిరణ్,యశోద హాస్పిటల్ సిబ్బంది విజయవంతంగా నిర్వహించారు. విలేకరుల సమావేశంలో యశోద హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నీళ్లదోపిడీపై కేంద్రాన్ని.. చంద్రబాబును నిలదీయండి

## తెలంగాణకు ద్రోహం చేసిందే వీరంతా.. కృష్ణాజలాల వివాదంపై బిఆర్ఎస్ నేతల విమర్శలు




**హైదరాబాద్,ఫిబ్రవరి 21(ఆర్ఎన్ఎ):** నీటి దోపిడీ బీఆర్ఎస్ నేతలపై విమర్శలు చేయడం మానేసి కేంద్రం, చంద్రబాబును ప్రశ్నించాలని కాంగ్రెస్‌పై బిఆర్ఎస్ నేతలు విమర్శలు గుప్పించారు. తెలంగాణకు ఏమైనా ద్రోహం జరిగిందంటే దానికి కాంగ్రెస్ పార్టీ, బీజేపీ,చంద్రబాబు నాయుడు, ఆయన శిష్యుడు రేవంత్ రెడ్డి బాధ్యులని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అవినీతి గురించి ప్రజలే మాట్లాడుకుంటున్నారని చెప్పారు. తెలంగాణ దాచిపెట్టుకున్న కృష్ణా నీళ్లను ఏపీ ఎత్తుకెళ్తున్నా రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తున్నది. ఏపీ నీటి దోపిడీతో తెలంగాణలో సాగు, తాగు నీళ్లకు కటకట ఏర్పడే పరిస్థితి ఉందని చెప్పారు. తెలంగాణ కోసమే పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అని చెప్పారు. నీళ్లలో నిప్పులు పుట్టించి ఉద్యమం నడిపిన పార్టీ తమదన్నారు. తెలంగాణపై అన్ని విషయాల్లో పరిశోధించిన నాయకుడు కేసీఆర్ అని చెప్పారు. నీటి వాటాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి కనీస సోయి లేదని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యేలు గ్యాదరి కిశోర్, బొల్ల మల్లయ్య యాదవ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కృష్ణా నీళ్ల దోపిడీ జరుగుతున్నదని, అడ్డుకోవాలని హరీశ్ రావు సలహా ఇచ్చారన్నారు. శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టుల్లో వాటాకు మించి ఏపీ నీళ్లు తీసుకెళ్తున్నదని చెప్పారు. సాగర్ ఎడమ కాలువ కింద సాగు, తాగు నీటికి ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడిరదని తెలిపారు. మన హక్కుగా ఉన్న 123 టీఎంసీల గురించి మాట్లాడాలన్నారు. నీటి విషయంలో మంత్రులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా మంత్రి ఉత్తమ్ కుమార్ చెత్త మాటలు మాట్లాడారు. ఉత్తమ్‌వి ఉత్తరకు మార మాటలు. రాష్ట్రానికి పొంచి ఉన్న ప్రమాదం గురించి మాట్లాడితే కాంగ్రెస్ నేతలు రాజకీయాలు మాట్లాడుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ, తెలంగాణలోనూ అన్యాయం చేసింది కాంగ్రెస్, బీజేపీలే. తెలంగాణకు సరైన నీటి వాటా దక్కకపోవడానికి చంద్రబాబు, రేవంత్ రెడ్డి, కాంగ్రెస్, బీజేపీలే కారణం. ఉత్తమ్ కుమార్ ఎవరో రాసిచ్చింది చదివారు. రేవంత్ రెడ్డి తిట్లతో సీఎం అయ్యారు. తాను కూడా అదే భాషతో మాట్లాడితే ముఖ్యమంత్రి అవుతానని ఉత్తమ్ అనుకుంటున్నారేమో. పదేండ్ల కేసీఆర్ పాలనలోసాగు తాగు నీళ్లకు ఎలాంటి కష్టం రాలేదు. రేవంత్ రెడ్డి మాట్లాడిన చెత్తనే కేసీఆర్ మీద ఉత్తమ్ మాట్లాడుతున్నారు. ఆయన మాట్లాడాల్సింది కేంద్రం మీద. పక్క రాష్ట్రం చంద్రబాబు మీద, ఏపీలో ప్రాజెక్టుల మీద. ప్రాజెక్టుల విషయంలో జగన్, చంద్రబాబు ఒకే వైఖరితో ఉన్నారు. తెలంగాణలో మాత్రం కేసీఆర్ ప్రాజెక్టులు కడుతుంటే కాంగ్రెస్ నేతలు కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకున్నారు. పోతిరెడ్డిపాడు ను వ్యతిరేకించి ఆనాడు మా పార్టీ వైఎస్ కేబినెట్ నుంచి బయటకు వచ్చింది. మాట్లాడుకుంటే తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహ చరిత్ర చాలా ఉంది. కృష్ణా జలాల్లో 50 శాతం వాటా కోసం ప్రయత్నిస్తున్నామని ఉత్తమ్ అంటున్నారు. ముందు ఉన్న పంటలను కాపాడటంపై దృష్టి పెట్టాలి. మోదీకి, చంద్రబాబుకు ఉత్తమ్ కుమార్ రెడ్డి భయపడుతున్నారు. జగన్ సీఎంగా రాష్ట్రానికి వస్తే గౌరవించుకోవద్దా. మీరీరు చంద్రబాబు దగ్గరికి క్యూ కట్టలేదా. మాట్లాడటానికి సిగ్గు ఉండాలి. కాంగ్రెస్ అవినీతి గురించి మాట్లాడుకుంటే అవినీతి అనే పదమే సిగ్గుపడుతుంది. ప్రతి దాంట్లో కమిషన్ అడుగుతున్న కాంగ్రెస్ నేతలా కేసీఆర్ గురించి మాట్లాడేది. మంత్రుల అవినీతి సంపాదన చిట్టా మా దగ్గర ఉంది. ప్రజలు కూడా చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్ కార్యకర్తల దగ్గర మంత్రులు కమిషన్ తీసుకుంటున్నారు. పంటలను కాపాడుకోవడానికి సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించేందుకు మనకు దక్కాల్సిన కృష్ణా జలాలు దక్కాలి. దీనికోసం బీఆర్ఎస్ ఎంతకైనా తెగిస్తుంది. మంత్రులు కృష్ణా జలాలపై సోయి లేకుండా సొల్లు పురాణం చెబుతున్నారు. కాళేశ్వరాన్ని ఎండబెట్టారు కాబట్టే గతంలో మాదిరిగా సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు నీళ్లు రావడం లేదు. కేసీఆర్‌ను తిట్టడం బంద్ చేసి కృష్ణా జలాల వాటాను సాధించుకోవడం మీద మంత్రులు దృష్టి పెట్టాలి. మా హయాంలో పదిహేడు పంట సీజన్లకు నీళ్లిచ్చాం. కేసీఆర్ హయంలో ఏపీకి నీళ్లు అక్రమంగా తరలిస్తే ఇన్ని పంటలు పండటం సాధ్యమా?అని ప్రశ్నించారు. రాష్ట్రంలో పెరిగిన పంట విస్తీర్ణం, పంట ఉత్పత్తికి సాగునీళ్ల సక్రమ వాడకమే కారణం. సర్పంచ్‌కు కూడా సమాధానం చెప్పలేని స్థాయి కాంగ్రెస్ నేతలది. వీళ్లా కేసీఆర్ గురించి మాట్లాడేది. ఇప్పటికైనా సోయి తెచ్చుకుని సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో తెలంగాణకు న్యాయమైన వాటా దక్కేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి. అసలు నీళ్లను ఎట్లా కొలుస్తారో కాంగ్రెస్ నేతలకు తెలుసా. ఉద్యమం నుంచే టీఎంసీల గురించి తెలంగాణ ప్రజలకు కేసీఆర్ అవగాహన కల్పించారు. కేసీఆర్‌ను విమర్శించడానికి కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కి సిగ్గుండాలి. కేంద్ర మంత్రులుగా ఉన్న వారికే కేఆర్ఎంబీ అధికారులతో మాట్లాడి తెలంగాణకు రావల్సిన నీళ్లు సాధించడం చేతకాదా అని జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు.

# హామీలను ప్రశ్నిస్తే ..హరీష్ రావుపై కేసులు

## తెలంగాణలో ఆరచక శక్తులు రాజ్యమేలుతున్నాయి: బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్




**హైదరాబాద్:** రేవంత్ రెడ్డి హామీలపై ప్రశ్నిస్తున్నందుకే హరీశ్‌రావుపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. తెలంగాణలో అరాచక శక్తులు రాజ్యమేలుతున్నాయని ఆయన ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్ మీడియాతో మాట్లాడారు.ఎన్నికల్లో ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ నేతలు ప్రజలపై మత్తు మందు చల్లారు. ఏడో గ్యారంటీగా ప్రజా పాలన అమలు చేస్తామని హామీ ఇచ్చి ప్రతీకార పాలన అమలు చేస్తున్నారు. బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి హరీశ్‌రావుపై రేవంత్ రెడ్డి కక్ష గట్టి ఓ నేరస్తుడు చక్రధర్‌తో పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో తప్పుడు కేసు పెట్టించారు. అధికారులను పావులుగా వాడుకుని హరీశ్‌రావును ఎంతగా వేధించినా ప్రజల పక్షానే ఉంటారు. హరీశ్‌రావు ఏడు సార్లు సిద్దిపేట నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. కొవిడ్ సమయంలో వైద్యారోగ్య శాఖ మంత్రిగా ఎన్నో సేవలు అందించారు. రేవంత్ రెడ్డిలాగా హరీశ్‌రావు ఓటుకు నోటు కేసులో పాలుపంచుకోలేదని అన్నారు. ఏద్కెనా చేసి దేంట్లోన్కెనా హరీశ్ రావును ఇరికించాలని రేవంత్ రెడ్డి విశ్వ ప్రయత్నం చేశారు. రేవంత్ రెడ్డిని హామీలపై ప్రశ్నిస్తున్నందుకే హరీష్ రావుపై కక్ష గట్టారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.ఎగవేతల రేవంత్ రెడ్డి అన్నందు కు మానకొండూరు పీఎస్‌లో కేసు పెట్టారు. యాదాద్రిలో రేవంత్ రుణ మాఫీ ఒట్టు పెట్టి మాట నిలుపుకోనందుకు హరీష్ రావు ప్రశ్నిస్తే అక్కడ కూడా కేసు పెట్టారు. ఇలా చిన్న చిన్న అంశాల్లో హరీశ్‌రావుపై కేసులు పెడుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు రేవంత్ అడుగులకు మడుగులొత్తుతున్నారు. పంజాగుట్ట కేసులో హరీశ్‌రావు దగ్గర కేవలం మూడు నెలలు పనిచేసిన వంశీని డీసీపీ చేసిన టార్చర్ అంతా ఇంతా కాదు. హరీశ్ రావు పేరు చెప్పాలని లేదంటే చంపేస్తామని డీసీపీ విజయ్ కుమార్ బెదిరించారు. నేను కూడా ఐపీఎస్ అధికారిగా పని చేశాను. సీఎంలు ఒత్తిడి చేసినంత మాత్రాన ఐపీఎస్ అధికారి పక్షపాతంతో వ్యవహరిస్తారా..? ఒత్తిడికి తలొగ్గలేమని చెప్పి విజయ్ కుమార్ లాంటి వాళ్ళు ఉద్యోగాలను వదిలివేయడం మంచిది అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. చక్రధర్‌పై రకరకాల కేసులు ఉన్నాయి. లైంగిక దాడి వంటి తీవ్ర నేరారోపణలు చక్రధర్‌పై ఉన్నాయి. 1900 మందిని ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన కేసు చక్రధర్‌పై ఉంది. కిడ్నాప్ కేసు కూడా చక్రధర్‌పై ఉంది. చక్రధర్ రేవంత్ ప్రోద్భలంతోనే హరీశ్‌రావుపై పంజాగుట్టలో కేసు పెట్టారు. మొదట హైకోర్టులో రిట్ వేసి చక్రధర్ విత్ డ్రా చేసుకున్నారు. ఆ తర్వాత పంజాగుట్టలో ఫిర్యాదు చేయగానే కొన్ని గంటల్లోనే హరీశ్‌రావుపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటి నుంచి హరీశ్‌రావు, ఆయన అనుచరగణంపై పోలీసులు కక్ష గట్టి వ్యవహరిస్తున్నారు

# ఢిల్లీ ఎన్నికల్లో బిజెపికి బి టీమ్‌లా కాంగ్రెస్

## రాహుల్‌కు గట్టిగా కౌంటర్ ఇచ్చిన మాయావతి

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి బీఎస్పీ నేత మాయావతి గట్టి కౌంటర్ ఇచ్చింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి బీ టీమ్‌లా కాంగ్రెస్ వ్యవహరించిందని, దాని వల్లే ఢిల్లీలో బీజేపీ గెలిచినట్లు మాయావతి పేర్కొన్నారు. అయితే ఎన్నికల సమయంలో.. ఇండియా కూటమికి బీఎస్పీ మద్దతు ఇవ్వలేదని, ఇది నిరుత్సాహానికి గురిచేసినట్లు ఇటీవల రాహుల్ గాంధీ పేర్కొన్నారు. బెహన్‌జీ తమతో కలిసి పనిచేస్తే, బీజేపీ నెగ్గేది కాదన్నారు. రాహుల్ చేసిన ఆరోపణలకు ఇవాళ మాయావతి కౌంటర్ ఇచ్చారు. తన ఎక్స్ అకౌంట్‌లో ఆమె పోస్టు చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి బీ టీమ్‌లా కాంగ్రెస్ పనిచేసిందన్న విషయం అందరికీ తెలుసు అని, దాని వల్లే బీజేపీ అధికారంలోకి వచ్చినట్లు ఆమె ఆ పోస్టులో పేర్కొన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ దారుణమైన పరిస్థితిలో ఉందని, కనీసం ఆ పార్టీ అభ్యర్థులకు చాలా చోట్ల డిపాజిట్ కూడా దక్కలేదని ఆమె తెలిపారు. ఇతరుల పట్ల వేలు పెట్టి చూపే ముందు, తన స్వంత వ్యవహారాల గురించి సమీక్ష చేసుకోవాలని కాంగ్రెస్ నేతకు మాయావతి సూచన చేశారు.ఢిల్లీలో ఏర్పడిన బీజేపీ సర్కారుకు ఎన్నికల వాగ్దానాలను అమలు చేయడం పెను సవాల్‌గా మారనున్నట్లు మాయావతి ఆరోపించారు.

# భూపాలపల్లి కోర్టు ఉత్తర్వులను కొట్టివేయాలి

## హైకోర్టును ఆశ్రయించిన కేసీఆర్, హరీశ్‌రావు

**హైదరాబాద్:** మేడిగడ్డ బ్యారేజీ కుంగిన వ్యవహారంలో భారాస అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. రాజలింగ మూర్తి ఫిర్యాదు మేరకు భూపాలపల్లి కోర్టు విచారణకు స్వీకరించి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. భూపాలపల్లి జిల్లా కోర్టు ఉత్తర్వులను కొట్టివేయాలని కోరుతూ కేసీఆర్, హరీశ్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా కేసీఆర్, హరీశ్‌రావు తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ జిల్లా కోర్టుకు విచారణార్హత లేకున్నా ఉత్తర్వులు జారీచేసినట్లు చెప్పారు. భూపాలపల్లి జిల్లా కోర్టులో ఫిర్యాదు చేసిన రాజలింగమూర్తి మృతి చెందినట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మీడియా ద్వారా తనకు ఈ విషయం తెలిసిందని న్యాయమూర్తి చెప్పారు. ఫిర్యాదు చేసిన వ్యక్తి మృతిచెందితే ఈ పిటిషన్‌పై ఎలా విచారణ చేపడతామని ప్రశ్నించారు. ఫిర్యాదుదారు మృతి చెందినా విచారణ కొనసాగించాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోరారు. ఈ మేరకు సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులు ఉన్నాయన్నారు. వాదనలు వినిపించేందుకు గడువు ఇవ్వాలని కోరారు. అనంతరం తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

# ట్రంప్ ఆరోపణలపై కూపీ లాగుతున్న ప్రభుత్వం

## ఎన్నికల ఖర్చు వ్యవహారంపై దృష్టి సారించిన అధికారులు

**న్యూఢిల్లీ:** భారత్‌లో ఎవరినో గెలిపించడానికి గత అధ్యక్షుడు జో బైడెన్ రూ.182 కోట్ల నిధులను కేటాయించారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారయి. దీనిపై ప్రభుత్వం కూపీ లాగే పనిలో పడిరది. ఈ వ్యవహారంపై తాజాగా భారత ప్రభుత్వం స్పందించింది. ఓటింగ్‌ను పెంచడం ద్వారా భారత ఎన్నికల్లో జోక్యం చేసుకునేందుకు యూఎస్ఎయిడ్ ప్రయత్నించిందనే వార్తలు తీవ్ర కలవరపాటుకు గురిచేస్తున్నాయని పేర్కొంది. దీనిపై సంబంధిత విభాగాలు దృష్టి సారించాయని వెల్లడిరచింది. యూఎస్ కార్యకలాపాలు, నిధులకు సంబంధించి అమెరికా ప్రభుత్వ యంత్రాంగం వెల్లడిరచిన సమాచారాన్ని చూశాం. అవి తీవ్ర కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా భారత అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యం ఆందోళనలకు దారితీశాయి. ఈ దశలో దీనిపై బహిరంగంగా మాట్లాడటం తొందరపాటే అవుతుంది. సంబంధిత అధికారులు ఈ వ్యవహారాన్ని పరిశీలిస్తున్నారు. పూర్తి సమాచారం వచ్చిన తర్వాతే దీనిపై మరిన్ని వివరాలు వెల్లడిస్తాం‘ అని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ వెల్లడిరచారు.ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత వివిధ దేశాలకు అమెరికా చేసే సాయంపై పునఃసమీక్ష చేసే పనిలో నిమగ్నమయ్యారు.

# కేటీఆర్ టీ స్టాల్ ఎత్తివేత..

## ట్రాక్టర్‌లో తరలించిన మున్సిపల్ అధికారులు



**సిరిసిల్ల:** సిరిసిల్ల బతుకమ్మ ఘాటు వద్ద కేటీఆర్ ఫోటోతో ఏర్పాటు చేసిన కేటీఆర్ టీ స్టాల్‌కు ట్రేడ్ లైసెన్స్ లేదంటూ మున్సిపల్ అధికారులు మూసివేయించిన ఘటన మరువకముందే మరోసారి చిరు వ్యాపారిపై దౌర్జన్యం చేశారు. హోటల్ యజమాని బత్తుల శ్రీనివాస్‌కు కనీస సమాచారం ఇవ్వకుండానే, హోటల్లోని సామాగ్రిని కూడా తీసుకొనివ్వ కుండానే క్రేన్ సహకారంతో టీ స్టాల్ మున్సిపల్ అధికారులు సినారె కళామందిరానికి తరలించారు. మార్గమధ్యంలో అడ్డుకునే ప్రయత్నం చేసిన బత్తుల శ్రీనివాసును పోలీసులు స్టేషన్‌కు తరలించారు. అడ్డుకోవడం, ఆందోళన చేయడం లాంటివి చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు శ్రీనివాస్‌ను హెచ్చరించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు చక్రపాణి, తదితర నాయకులు పోలీసు స్టేషన్‌కు చేరుకుని బాధితుడికి భరోసానిచ్చారు

# రేవంత్ రెడ్డి సర్కారును కూల్చే కుట్ర జరుగుతుందా .!?

## కోవర్టులు అధికారులా.? నాయకులా?.
## కెసిఆర్ మాటల్లో మర్మమేంటి..?

**పగటి కలలు కంటూ మధ్యంతర ఎన్నికల వస్తున్నాయని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వాక్యలు.. కాంగ్రెస్ పార్టీకి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయా... వందకు వందశాతం టిఆర్ఎస్ అధికారంలోకి వస్తుందంటూ ధీమగా కార్యకర్తలకు హితబోధ చేస్తున్న కేసీఆర్ కు చెక్ పెడతారా..!? కెసిఆర్ మాటలు ఊసరవెల్లి గీతలు అని భావిస్తారా..! ఏది నిజం...? మధ్యంతర ఎన్నికలు వస్తే.. ప్రజలకు మేలు జరుగుతుందా... కెసిఆర్ కు మేలు జరుగుతుందా... మేల్కోవాల్సింది ఎవరు..?**




మద్యంతర ఎన్నికలు వస్తాయంటూ సంకేతలిస్తున్న కెసిఆర్ మాటల్లో మర్మమేంటి..? కాంగ్రెస్ ప్రభుత్వంలో కెసిఆర్ కోవర్టులు ఉన్నారు అని అనుమానాలు కూడా లేకపోలేదేమో..! ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నం జరుగుతుందని చెప్పకనే చెప్పుకుంటూ బిఆర్ఎస్ పార్టీ సమన్వయ సమావేశంలో కేసీఆర్ సంకేతాలు పంపిందని చెప్పాల్సిందేనా? దీనితో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ప్రమాద ఘంటికలు పొంచి ఉన్నాయని తెలుసుకోలేకపోతున్నారా..? అతి విశ్వాసమే కొంప ముంచానుందా..? కనీసం శాసనసభ సమావేశానికి హాజరై ప్రశ్నించిన సందర్భం లేదు. గ్రామాలలో వెళ్లి ప్రచారం చేసిన సందర్భం లేదు.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి భయంతో ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టుకోలేని స్థితిలో ఉన్న కేసీఆర్ మద్యంతర ఎన్నికలు వస్తాయంటూ సంకేతం ఇవ్వడం వెనక కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆయన కోవర్డులు ఉన్నారా.. అంత ధీమా ఎలా..? కెసిఆర్ పుణ్యమా అని తెలంగాణ ప్రభుత్వం అప్పుల్లో కూడుకపోవడమే కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పై అనేక నిందలు అనేక ఆరోపణలు తెచ్చే వరకు తీసుకెళ్లింది అంటే ఇదంతా టిఆర్ఎస్ ప్రభుత్వమే చేసిన పాపాలే కదా.. ఇప్పటికిప్పుడు ప్రభుత్వం కోలుకోవాలంటే కనీసం లక్షల కోట్లు బడ్జెట్ ఉండాల్సిందే కానీ ఇప్పుడు ఆ పరిస్థితులు లేని స్థితి. చివరకు కేంద్ర ప్రభుత్వం కూడా తేల్చి చెప్పిన విషయం ప్రజలకు తెలిసే ఉండాల్సింది తెలంగాణలో కేసీఆర్ అప్పుల కుప్పగా చేసి ప్రభుత్వాన్ని వదిలేశాడని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేరుకోలేకపోతుందని కేంద్రం ముందస్తు హెచ్చరికలు జారీ చేసిన విషయం మరిచిపోదామా..? కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు కాకపోవడంలో గత ప్రభుత్వం చేసిన అప్పులే కారణం కాదా..? కెసిఆర్ ప్రభుత్వం 10 సంవత్సరాలలో ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను చేపట్టిందా..? మరి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పని ఎలా చేసింది. ఒక్కసారి నిరుద్యోగులు కానీ మేధావులు కానీ ఆలోచించాల్సిందే. అన్ని ప్రైవేట్ పరం చేస్తూ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు నియమిస్తూ ప్రభుత్వంలో వీలినం కాకుండా కుట్రలు చేస్తున్న కేసీఆర్ మేళా.. ప్రభుత్వ ఉద్యోగులను ఉద్యోగ క్యాలెండర్ ను చేపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం మేళా అనేది ప్రజలు తెలుసుకోవాల్సిందే. కాంగ్రెస్ లో ఉన్న నాయకులు క్రమశిక్షణ లేకపోవడమే కేసీఆర్ కు ఆయుధంలా దొరుకుతుందనే భావన ప్రజలలో ఉంది. రోజురోజుకు ప్రభుత్వంపై ఎత్తుకు పై ఎత్తు వేస్తూ కేటీఆర్ హరీష్ రావు మరోపక్ష విమర్శలు చేస్తున్నారంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతున్న రోజుకో తీరు రోజుకో మాట పైనే వాళ్లకు అవకాశం కల్పిస్తున్నట్లే కదా..! రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కాపాడాలంటే ఓకే స్టాండింగ్ పై లీడర్స్ ఉండాల్సిందే కదా.... ఇలాంటప్పుడు రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ లీడర్లు ఎందుకు జీర్ణించుకోలేకపోతున్నారు. ఒకసారి గమనించాల్సిందే. లేదంటే పది సంవత్సరాల తర్వాత వచ్చిన అవకాశం మళ్ళీ వస్తుందా.. అభివృద్ధి చేస్తే తప్ప మళ్ళీ అవకాశం లేదు. ఇప్పటికే రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏ ప్రభుత్వం అధికారం చేపడుతుందో అనేది తేల్చి చెప్తున్నాయని సంకేతాలు కూడా లేకపోలేదు. కాంగ్రెస్ గెలుస్తుందా... బీజేపీ గెలుస్తుందా... స్వతంత్ర అభ్యర్థులు గెలుస్తున్నారా.. అనేదే ఇప్పుడు ప్రశ్నాత్మకంగా మారింది. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న పథకాలలో పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం బిజెపికి అవకాశం దొరికింది. టిఆర్ఎస్ పార్టీ అధినేత కావాలని ఈసారి ఎన్నికలలో వారి అభ్యర్థులు పెట్టకపోవడం బీజేపీకి ఛాన్స్ ఇవ్వడమే కూడా,అంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చడమే ధ్యేయంగా ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలో భాగమే కదా.. ఇలాంటి పరిస్థితులలో కాంగ్రెస్ నాయకులకు సోయి ఉందా..? లేదా ..రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నం జరుగుతుందని ఇప్పటికన్నా తేరుకొని ప్రభుత్వం పనితీరు మార్చుకోకుంటే పరిస్థితులు మధ్యంతర ఎన్నికలకు వెళ్లాల్సిందేమో..? ఇక్కడ కొన్ని విషయాలు చాలా స్పష్టంగా చెప్పుకోవాలి. టిఆర్ఎస్ ప్రభుత్వం కన్నా ఇప్పుడు పాలన తక్కువ ఏమీ జరగడం లేదు. ప్రజలపై ఎలాంటి పనుల భారం మోపలేదు. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలు ఎక్కడ ఆగిపోలేదు. పైగా మరింత మెరుగైన పనులు జరుగుతున్నాయి. తెలంగాణలో రైతులకు నీళ్ళకొర్తలేదు. కరెంటు కొరత లేదు మంచినీటి సరఫరా ఆగిపోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం తక్కువైంది. గత ప్రభుత్వం కూడా ఆర్టీసీ ఆస్తులను అమ్మే ప్రయత్నం చేసింది అడ్డుకునే ప్రయత్నం చేసిన ఆర్టీసీ కార్మికులను డిస్మిస్ చేసిన సందర్భాలు లేకపోలేదు. ఆర్టీసీని ప్రవేట్ ఫారం చేసి ఆర్టీసీ ఆస్తులను గంపగుత్తగా అమ్ముకునే ఎత్తులు గత ప్రభుత్వం వేసింది ప్రభుత్వ ఉద్యోగులకు ఆర్టీసీ కార్మికులకు తెలియదా.? ఇప్పటికైనా ఆర్టీసీ కార్మికులు కూడా టిఆర్ఎస్ పార్టీని జాడలోకి రాకుండా ఉండాలంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆర్టీసీ కార్మిక ఉద్యోగులపైనే ఉంటుంది. సమ్మె సైరన్ మోగిస్తే. నష్టం ఎవరికి కాంగ్రెస్ ప్రభుత్వానికా... ఆర్టీసీ కార్మికులకా... ప్రజలు కూడా మేల్కోవాల్సిన అవసరం ఉంది. ఎవరు ఏం మాట్లాడుతున్నారో ఏ నాయకుడు ఎవరితో పోతున్నారో ..ఏ లీడర్ ఏ అధికారి ఏం చేస్తున్నారని. ఫోన్ టాపింగ్ చేస్తూ బెదిరింపుల గురిచేసిన ప్రభుత్వం. మళ్లీ అలాంటి కష్టాలను తెచ్చుకుంటారా...? కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా తేరుకొని కోవర్టులను గుర్తించి, ప్రతిపక్ష పార్టీ నాయకులకు చెక్కు పెట్టాల్సిన అవసరం ఉంది. మరి అధికారులల్లో ఉన్నారా... ఎమ్మెల్యే ఎమ్మెల్సీలలో ఉన్నారా..? సునీతంగా సమస్యను పరివేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాజకీయ కక్షలకు ,రాజకీయ కుట్రలకు తావు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఐదు సంవత్సరాల వరకు కొనసాగిస్తూ, ఆధిపత్య రాజకీయాలు చేస్తూ ప్రభుత్వాన్ని అడుగడుగున ఇరుకునపెట్టే వారిని పార్టీ క్రమశిక్షణ చర్యలు చేపడుతూ, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని మరింత అభివృద్ధి వైపు దూసుకెళ్తుందని భావించే విధంగా, ఇంటి దొంగలను ఈశ్వరుడైన పట్టలేదంటూ టిఆర్ఎస్ అధినేత చేసిన మాటలకు, చెక్ పెడుతూ, మధ్యంతర ఎన్నికలకు తావు లేకుండా ప్రతిపక్షల విమర్శలు తిప్పికొట్టే విధంగా లోపాలను సరిదిద్దుకుంటూ, విమర్శకు ప్రతివిమర్శగా నిలుస్తూ, టిఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ కు ఘాటైన దీటుగా సమాధానం పెడతారని భావిస్తూ...



**వెంకగారి భూమయ్య**
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

---

## కనీస రహదారికి
# నోచుకోని గిరి పల్లెలు
### గూడాల్లో కానరాని మంచినీటి సౌకర్యం

**భద్రాచలం:** జిల్లావ్యాప్తంగా అనేక గ్రామాల ప్రజలు నేటికీ రహదారి సౌకర్యానికి నోచుకోవడం లేదు. రాళ్లతో నిండిన బాటలతో నడక సాగిస్తూ నానా పాట్లు పడుతున్నారు. అనేక గ్రామాలకు కాలిబాటలు కూడా లేవు. నేటికీ డోలీలు ఆశ్రయిస్తున్నారు. గిరిజన గ్రామాలుఅనేకం రవాణాకు దూరంగా ఉన్నాయి. దీంతో ఇతర గ్రామాలకు వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో ఇతర గ్రామాలకు వెళ్లాలన్నా, పంటలను విక్రయిద్దామన్నా కొండలను ఎక్కి దిగాల్సి వస్తుంది. రహదారి, తాగునీరు సౌకర్యం లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించాలని స్థానిక గిరిజన సంఘాలు కోరుతున్నాయి. అనేక గిరిజన గ్రామాల్లో నేటికీ విద్యుత్ సౌక్యం లేకుండా పోయింది. ఇలాంటి గ్రామాల్లో అభివృద్ధి మాటెలా ఉన్నా అక్కడికి చేరుకోవడానికి దారులు కూడా లేవు. గిరి ప్లలెలకు రహదారి, విద్యుత్తు సౌకర్యం కల్పించ డానికి కృషి చేయాలని ఆదివాసీలు కోరుతున్నారు. ఆయా గూడాల్లోని గ్రామాల్లో ఒక్కగానొక్క బోరు మాత్రమే ప్రజల నీటి అవసరాలను తీరుస్తోంది. అనేక గ్రామాల్లో ఇప్పటికీ చెలిమెలు, వాగు నీటితోనే గొంతు తడుపుకొంటున్నారు. గిరిజనుల గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కరవయ్యాయి. ప్రధానంగా అంటువ్యాధులు ప్రబలే ప్రమాదంతో పలుచోట్ల గ్రావిరీణులు నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు. గ్రామాలకు నేటికీ రహదారుల లేక ప్రజలు ఇతర గ్రామాలకు రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడుతున్నారు. దట్టమైన అడవుల్లో, మొనదేలిన రాళ్ల మధ్య నడుస్తూ బతుకుపోరాటం చేస్తున్నారు. ఇక చినుకు పడితే కాలు తీసి ముందుకు వేయలేని విధంగా బురద దారులు, వంతెనలు లేని అనేక గ్రామాల ప్రజలు వర్షాకాలం బాహ్య ప్రపంచానికి దూరం అవుతున్నారు. విద్యుత్ వెలుగులు, తాగు నీరు, రహదారులు వంటి సదుపా యాలు కొరవడిన గ్రామాల్లో ప్రజలు అవస్థలుపడటం పరిపాటిగా మారింది. ఓటర్లుగానే తప్పితే మనుషులుగా తమను నాయకులు గుర్తించడం లేదంటూ గిరిజనులు వాపోతున్నారు. కొండకొనలతో సహజీవనం చేస్తూ, మౌలిక సదుపాయాలు కొరవడి అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న పల్లెలపై నేతలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

---

# పెళ్లి మంటపంలో విషాదం
### గుండెపోటుతో పెళ్లికూతురు తండ్రి మరణం




**కామారెడ్డి:** కాళ్లు కడిగి బిడ్డ కన్యాదానం చేయాల్సిన తండ్రి..అప్పటివరకు హుషారుగా పెండ్లి పనుల్లో మునిగి తేలాడు..బంధువులను ఆహ్వానించారు. కళ్యాణ మండప మంతా కలియ తిరిగి పెళ్లి పనులు చూసుకున్నాడు. అయితే ఇంతలోనే గుండెపోటు..అప్పటివరకు హుషారుగా తిరిగిన వ్యక్తి కుప్ప కూలాడు. కామారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. కన్న కూతురు పెండ్లి జరుగుతుండగా.. పెండ్లి మండపంలోనే గుండెపోటుతో కుప్పకూలిపోయాడు ఓతండ్రి. ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో పెండ్లి ఇంట్లో విషాదం నెలకొంది. భిక్కనూరు మండలం రామేశ్వర్ పల్లికి చెందిన కుడిక్యాల బాలచంద్రం (54) గుండెపోటుతో మృతిచెందారు. జిల్లా కేంద్రంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో నివసిస్తున్న బాలచంద్రం..శుక్రవారం (ఫిబ్రవరి 21) న తన పెద్ద బిడ్డ మహాలక్ష్మి పెండ్లి స్థానిక ఫంక్షన్ హాల్ లో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.. కుటుంభసభ్యులు, బంధువులు అందరూ పెండ్లి మండపం చేరుకున్నారు. పెళ్లి తంతు మొదల్కొంది. తాళికట్టే కొద్ది సమయానికి ముందు బాలచంద్రం ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. చికిత్సకోసం బాలచంద్రాన్ని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు కుటుంబసభ్యులు. బాలచంద్రానికి సీపీఆర్ చేసి పరీక్షించారు డాక్టర్లు.. అప్పటికే గుండెపోటుతో చనిపోయినట్లు నిర్ధారించారు.

---

# మంచినీటి సమస్యపై దృష్టి పెట్టాలి

**రంగారెడ్డి:** వేసవి తొంగి చూస్తున్నందున ఇప్పటికే గ్రామాల్లో నీటి సమస్యలు మొదలయ్యాయని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక నేతలు అన్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి గ్రామానికి నీటి సరఫరా చేమాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఓవర్ హెడ్ ట్యాంకుల వద్ద మురుగునీరు నిల్వకుండా, లైన్‌మెన్, వాటర్ గ్రిడ్, ఆర్‌డబ్ల్యూస్ అధికారులు పేర్లు, వారి సెల్ నెంబర్లు రాయవల్సిందిగా సూచించారు. నిర్మాణంలో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా కోరారు. జిల్లా అధికారులు సమన్వయంతో పని చేస్తేనే ఇల్లా అభివృద్ధి ముందుకు సాగుతోందన్నారు.

# రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ముల దుర్మరణం





**- గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం**
**- ఆందోళనకరంగా మరో యువకుడి పరిస్థితి**
**- నాచారం గ్రామంలో విషాదచాయలు**

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** ఓ రోడ్డు ప్రమాదం ఓ తల్లికి కడుపుకోత మిగల్చగా, ఆ కుటుంబానికి తీరని శోకం మిగిల్చింది. పరకాల సమీపంలోని కంతా ఆత్మకూర్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హార్ మండలం నాచారం గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు దుర్మరణం చెందడం ఆ కుటుంబాన్ని శోక సంద్రంలో ముంచేసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మల్హార్ మండలం నాచారం గ్రామానికి చెందిన  ఉప్పుల చెంద్రం జయ దంపతులకు ఉప్పుల రాజు కుమార్ (25), శంకర్ (22) ఇద్దరు కుమారులు. రాజ్ కుమార్ హనుమకొండలో ప్రైవేట్ కంపెనీలో వర్క్ చేస్తుండగా



శంకర్ హనుమకొండలోని హాస్టల్లో ఉంటూ ఐ.టి.ఐ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. శుక్రవారం రాత్రి రాజ్ కుమార్, శంకర్ అన్నదమ్ములతో పాటుగా, కాటారం మండలం గంగారం గ్రామానికి చెందిన శివ అనే మిత్రుడితో కలిసి ముగ్గురు బైక్ పై హన్మకొండ నుండి నాచారం గ్రామానికి బయలుదేరారు. పరకాల సమీపంలోని కంఠ ఆత్మకూర్ క్రాస్ వద్ద వీరు నడుపుతున్న బైక్ ను గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో రాజ్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా శంకర్, శివకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు హనుమకొండ గవర్నమెంట్ హాస్పిటల్ కి తరలించారు. అయితే చికిత్స పొందుతూ శంకర్ కూడా మృతి చెందగా శివ పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అందరితో కలుపుగోలుగా ఉండే అన్నదమ్ములు హఠాత్తుగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం స్థానికులను కలచివేసింది. రాజు కుమార్, శంకర్ స్వగ్రామమైన నాచారంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కొసా ప్రొటెక్షన్ గ్రూప్ కమాండర్ లొంగుబాటు

**- వివరాలు వెల్లడించిన సీపీ అంబర్ కిషోర్ ఝా**




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు కడారి సత్యనారాయణ రెడ్డి ఆలియాస్ కొసా ప్రొటెక్షన్ గ్రూప్ కమాండర్ వంజెం కేషా అలియాస్ జిన్ని శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఎదుట లొంగిపోయింది. ఈ మేరకు శుక్రవారం సీపీ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు.  ఛత్తీస్‌గడ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా, పామెడ్ మండలం, రాసపల్లి గ్రామానికి చెందిన వంజెం కేషా నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీ గొత్తికొయ ఏరియా కమిటీ సభ్యురాలుగా పని చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆమె తండ్రి హిడ్మా కూడా మావోయిస్టు పార్టీలో పని చేసే వాడని ప్రస్తుతం జైలులో ఉన్నట్లు తెలిపారు. ఈ క్రమంలో కేషా బాల్యంలోనే చైతన్య నాట్య మండలిలో పని చేసి మావోయిస్టు పార్టీకి చెందిన సభ్యులతో పరిచయాలతో 2017లో పామెడ్ లోకల్ స్క్వాడ్ కమాండర్ గొట్టే కమల ద్వారా మావోయిస్టు పార్టీలో చేరి రెండేళ్ల పాటు పున్నెం జోగ అధ్వర్యంలో చైతన్య నాట్యమండలిలో పనిచేసినట్లు ఆయన వివరించారు. ఇదే సంవత్సరం కేషాను పార్టీ నాయకత్వం అబుజ్‌మడ్ ప్రాంతానికి బదిలీ చేసి కేంద్ర కమిటీ సభ్యుడు కడారీ సత్యనారాయణ రెడ్డికి ప్రొటెక్షన్ గ్రూప్ సభ్యురాలిగా నియమించిందని, . 2021లో కేంద్ర మవోయిస్టు నాయకత్వం కేషాను ఏరియా కమిటీ సభ్యురాలిగా నియమించగా  2022 డిసెంబర్ వరకు ప్రొటెక్షన్ గ్రూప్ సభ్యురాలిగా పనిచేసి కేషా మరో మావోయిస్టు ఏరియా కమిటీ సభ్యుడు రమేష్‌ను వివాహం చేసుకోని ఉత్తర బస్తర్ డివిజన్లో కొద్ది కాలం పని చేసిందని, అనంతరం 2024 ఎప్రిల్ మాసంలో తిరిగి కేంద్ర కమిటీ సభ్యుడు కడారి సత్యనారాయణ రెడ్డి ఆలియాస్ కొసా ప్రొటెక్షన్ గ్రూప్ మహిళా కమాండర్ బాధ్యతలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. అయితే పార్టీలో పనిచేసిన సమయంలో కొహిలబేడా పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టు పార్టీ సభ్యులతో కలిసి పోలీసులపై కాల్పులు జరపడంతో ఒక పోలీస్ అధికారి మరణించగా మరో పోలీస్ అధికారి తీవ్రంగా గాయపడిన ఘటనలో జిన్ని ఉన్నారని, అలాగే అబుజ్‌మడ్‌లో ప్రాంతంలో పోలీసులపై జరిపిన కాల్పుల్లో ఒక పోలీస్ అధికారి మరణించాడని ఆయన తెలిపారు. ఆమెపై రూ.4లక్షల రివార్డు ఉన్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం లొంగిపోయిన మావోయిస్టు పార్టీ సభ్యులకు అందిస్తున్న పునరావాస పథకాలకు అకర్షితులు కావడంతో పాటు, ప్రధానంగా తాను సురక్షితంగా లొంగుబాటు అయ్యేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని వరంగల్ కమిషనరేట్ పోలీస్ అధికారులు ఇచ్చిన వాగ్దానంతో లొంగిపోయినట్లు తెలిసింది.

## నీటి సరఫరా సమస్యలపై టోల్ ఫ్రీ నంబర్

**ములుగు ప్రతినిధి, (నినాదం):** గ్రామీణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాలో సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల స్వీకరణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా 18005994007 టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని మిషన్ భగీరథ ఇంట్రా డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ సుభాష్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కాల్ సెంటర్ హైదరాబాద్ మిషన్ భగీరథ హెడ్ ఆఫీసులో టోల్ ఫ్రీ నంబర్ 24/7 పనిచేస్తుందని, ఫిర్యాదు స్వీకరించిన 24 గంటల్లో సమస్యను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకుంటారని అన్నారు. ములుగు జిల్లాలోని అన్ని గ్రామాలలో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులున్నా ఈ నెంబర్‌కు కాల్ చేసి సమస్యను తెలుపాలని ఆయన కోరారు.

## షటిల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రధానం...



**ములుగు ప్రతినిధి, (నినాదం):** ఏటూరునాగారం మండల కేంద్రంలో నిర్వహించిన షటిల్ టోర్నమెంట్ విజేతలకు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బహుమతులు ప్రధానం చేశారు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్  సహకారంతో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన షటిల్ టోర్నమెంట్ విజేత క్రీడాకారులకు పది వేల రూపాయల మొదటి ప్రైజ్ మని, బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నరసింహారావు, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు సర్వ అక్షిత్,జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి ఎండీ గౌస్ పాషా, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గద్దల నవీన్, కందుకూరి రతన్, పాగ నాగరాజు, ముజామిల్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి నివారణకు చర్యలు

### -ఎంపిడివో సునీల్‌కుమార్



వరంగల్ ఫిబ్రవరి 21 (నినాదం న్యూస్ ) : వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వరంగల్ జిల్లా ఖానాపురం ఎంపిడీవో అంబటి సునీల్ కుమార్ రాజు పంచా యతీ గ్రామకార్యదర్శులను ఆదేశించారు. ఖానా పురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తాగునీరు , విద్యుత్ పారిశుధ్యం, ట్యాంకుల నిర్మా ణం, ఇతర అభివృద్ధి పనులపై సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో  అంబటి సునీల్ కుమార్ రాజ్ మాట్లాడుతూ వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులు, మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్ తో శుభ్రం చేయాలని తెలిపారు. ఖానాపురం మండలంలో ఎక్కడైనా విద్యుత్ అంతరాయం వల్ల తాగునీటికి ఇబ్బంది ఏర్పడితే వెంటనే వాటిని అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే సంబంధిత విద్యుత్ అధికారులకు  అసిస్టెంట్ ఇంజినీర్లు కు సమాచారం అందించాలని తెలిపారు. వనమహోత్సవం భాగంగా నాటిన మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు ట్యాంకర్ల ద్వారా నీరు పోయాలన్నారు. తాగునీటి, విద్యుత్ సరఫరా, పారిశుధ్యం , వైకుంఠధామలకు నీటి సౌకర్యం పారిశుద్ధ పనులు నిర్వహణలో గ్రామపంచాయతీ కార్యదర్శులు,సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దని చెప్పారు. విధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహించిన గ్రామపంచాయతీ కార్యదర్శులు,సిబ్బందిపై శాఖ పరమైన చర్యలకు ఉపక్రమిస్తామని తెలిపారు.